


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్



మెరుగైన సేవలందించేందుకే..

● రెండో ప్రయత్నంలోనే ఐఏఎస్ సాధించిన మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, జూలై 27: మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మేఘస్వరూప్ రెండో ప్రయత్నంలోనే సివిల్స్ పరీక్షల్లో ఆలిండియా 31వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. కర్నూల్ జిల్లాకు చెందిన వై.చంద్రశేఖర్‌రావు, అరుణ దంపతులకు ఇద్దరు కుమారులు. చంద్రశేఖర్‌రావు పంజాబ్ రాష్ట్రం జలందర్‌లో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌లో సీనియర్ జీఎంగా పనిచేస్తుండగా అరుణ గృహిణిగా ఉన్నారు. వీరి పెద్దకుమారుడు వై.మేఘస్వరూప్ ఐఏఎస్‌కు ఎంపిక కాగా చిన్న కుమారుడు సందీప్‌కుమార్ ఎంబీబీఎస్ పూర్తి చేసి మణిపాల్‌లో పీజీ కోర్సు చేస్తున్నారు. మేఘస్వరూప్ ప్రాథమిక విద్య అంతా గుత్తిలోని కేంద్రీయ విద్యాలయంలో చదువుకున్నారు. ఇంటర్ తరువాత వారణాసి ఐఐటీలో ఎలక్ట్రికల్ బీటెక్ పూర్తి చేసిన మేఘస్వరూప్ బెంగళూరు, ఢిల్లీలో ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాల్లో చేరారు. ఉద్యోగం చేస్తూనే ఢిల్లీలోని కోచింగ్ సెంటర్‌లో సబ్జెక్టు వారీగా శిక్షణ తీసుకున్నారు. దీంతో పాటు స్వయంగా చదువుతూ 2019 సంవత్సరంలో సివిల్స్ పరీక్షకు హాజరయ్యారు. తొలి ప్రయత్నంలోనే ఆలిండియా 98వ ర్యాంకు సాధించిన మేఘస్వరూప్ ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. హైదరాబాద్ అకాడమిలో ఐపీఎస్ శిక్షణ తీసుకున్నాక, మహారాష్ట్ర క్యాడర్‌లో చేరారు. అక్కడ ఉంటూనే 2021 సంవత్సరంలో రెండోసారి సివిల్స్ పరీక్ష రాశారు. ప్రజలకు చేరువలో ఉండి సేవలందించేదుకే మేఘస్వరూప్ ఐఏఎస్‌కు ప్రిపేర్ అయ్యారు. ఈసారి మేఘస్వరూప్ సివిల్స్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 31వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి అకాడమీలో ఏడాది పాటు శిక్షణ తీసుకున్న మేఘస్వరూప్, మరో ఏడాది పాటు చిత్తూరు జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ తీసుకున్నారు. చిత్తూరు కలెక్టర్లు హరినారయణ్, షణ్మోహన్ పర్యవేక్షణలో శిక్షణ పూర్తి చేసుకున్న మేఘస్వరూప్ అనంతపురం నగర కమిషనర్‌గా తొలిపోస్టింగ్ పొందారు. ముస్సోరిలో శిక్షణ తీసుకుంటున్న సమయంలోనే మణిపూర్ నుంచి ఐఏఎస్‌కు ఎంపికైన నిదియాతో పరిచయంతో మేఘస్వరూప్ ఆమెను 2023 ఫిబ్రవరిలో తిరుమలలో వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో అనంతపురం కమిషనర్‌గా పోస్టింగ్ తీసుకున్న మేఘస్వరూప్‌కు స్పౌస్ విధానంలో ఆయన సతీమణి నిదియాను అనంతపురం జడ్పీ సీఈవోగా పోస్టింగ్ ఇచ్చారు. వీరిద్దరికి 2024 జనవరిలో అనంతపురంలో పోస్టింగ్ ఇవ్వడంతో 2024 మేలో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో అప్పటి కలెక్టర్ ఆదేశాలతో మేఘస్వరూప్ మూడు నియోజకవర్గాలకు, నిదియా రెండు నియోజకవర్గాల ఎన్నికల్లో అన్ని అంశాలపై విధులు నిర్వహించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం 64 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసిన ప్రక్రియలో మేఘస్వరూప్ మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా, నిదియా రాజంపేట సబ్‌కలెక్టర్‌గా నియమితులయ్యారు.

ప్రజలకు సేవలందించడమే తొలి ప్రాధాన్యత

మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ప్రజలకు సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాలు సకాలంలో అందించడమే తన తొలి ప్రాధాన్యత అని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సబ్‌కలెక్టరేట్ నుంచి పాలన అందించడంలో పాటు క్షేత్రస్థాయిలో అన్ని మండలాలు పర్యటించి వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకుంటానన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారం కోసం సబ్ కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజల సమస్యలపై తక్షణం స్పందించడంతో పాటు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం అయిన తరువాత, కార్యాలయ మరమ్మతులు చేయించడంతో పాటు గత రెండేళ్లలో 11 మండలాల నుంచి సబ్‌కలెక్టరేట్‌కు వచ్చిన 2,400 రన్నింగ్ ఫైళ్లలో కాలిపోయిన వాటిని రికవరీ చేస్తామన్నారు. సబ్‌కలెక్టరేట్‌లో భూసేకరణ, ఆర్‌వోఆర్, ఎస్టాబ్లిష్‌మెంట్ ఫైళ్లకు నష్టం లేదని, మంటలను ఆర్పే సమయంలో తడిచిపోయిన 700 ఫైళ్లను రెండు వారాల్లో రికవరీ చేస్తామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో వచ్చే సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నిర్వహించేందుకు ప్రయత్నిస్తామన్నారు. అనంతపురం కమిషనర్‌గా పనిచేసిన తాను మదనపల్లె మున్సిపల్ పాలనపై పట్టు ఉందని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తన అభిప్రాయాలను పంచుకున్నారు.



మేఘస్వరూప్, సబ్‌కలెక్టర్

వందశాతం పెన్షన్ల పంపిణీ జరగాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 27: జిల్లాలో ఆగస్టు 1వ తేదీనే వందశాతం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ జరగాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌డీఏ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, డీపీవో, ఎంపీడీవో, డీఎల్‌డీవో, ఎల్డీఎం తదితర అధికారులతో పెన్షన్ల పంపిణీపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,22,313 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.94 కోట్ల 34 లక్షలు పంపిణీ చేయబోతున్నామని తెలిపారు. ఈనెల 31వ తేదీ నగదు మొత్తం బ్యాంకుల నుంచి తీసుకోవాలని చెప్పారు. గత నెలలో ఎవరితో అయితే పెన్షన్లు పంపిణీ చేశారో ఇప్పుడు కూడా వారిని ఉపయోగించుకోవాలని ఎంపీడీవోలు, డీపీవో, కమిషనర్‌లను ఆదేశించారు. పెన్షన్ల పంపిణీలో వలంటీర్లను ఉపయోగించవద్దని తెలిపారు. జిల్లాలోని అన్ని బ్యాంకులకు టెలీ కాన్ఫరెన్స్ పెట్టి ఎంపీడీవోలకు, ఇతర అధికారులకు నగదు సమయానికి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని బ్యాంక్‌లకు సూచించాలని ఎల్డీఎం ఆంజనేయులును ఆదేశించారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొనేటప్పుడు అక్కడ అన్ని రకాల సదుపాయాలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. పెన్షన్ల పంపిణీపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్‌ను, మండల ప్రత్యేక అధికారులను అదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, డీఎల్‌డీవో లక్ష్మిపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

● పాఠశాల ఎదుట బాలికల తల్లిదండ్రుల ఆందోళన



లక్కిరెడ్డిపల్లె, జూలై 27: విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడే బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ఆ పాఠశాలలో చదువుతున్న చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. మండలంలోని చౌటపల్లె పంచాయతీలోని రవీంద్రనగర్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అందులో వెంకటేశ్వర్లు అనే ఉపాధ్యాయుడు 4, 5 తరగతులు చదువుతున్న బాలికల శరీరాన్ని తాకుకూ అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని విద్యార్థినుల తల్లిదండ్రులు శనివారం ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు శనివారం పాఠశాలకు రాలేదు. పాఠశాల ఎదుట తల్లిదండ్రులు అందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న దీంతో వెంటనే ఎంఈవోలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్యలు పాఠశాలకు చేరుకుని విచారణ చేశారు. విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవోలు విద్యార్థినులు తల్లిదండ్రులకు నచ్చచెప్పారు. అనంతరం వారు పాఠశాలలోని విద్యార్థినులను విచారించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

కోదండరామాలయంలో హైకోర్టు న్యాయమూర్తి



ఒంటిమిట్ట, జూలై 27 : ఒంటిమిట్ట కోదండరాముడిని హైకోర్టు న్యాయమూర్తి ఆకుల వెంకటశేషసాయి శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మూలవిరాట్ అయిన సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. రంగమండపంలో అర్చకులు ఆలయ విశిష్టత, చరిత్రను తెలియజేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు వీణారాఘవాచార్యులు, ఎస్‌ఐ మధుసూదన్‌రావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో వైసీపీ ముఖ్య నాయకులు

● మాజీ మంత్రి, ఎంపీ అనుచరులు పరార్ ● పట్టణంలో చర్చనీయాంశంగా మారిన వైనం



డీఎస్పీ కార్యాలయంలోకి విచారణ కోసం వెళుతున్న వైసీపీ నాయకుడు అక్కులప్ప

మదనపల్లె టౌన్, జూలై 27: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసులో పోలీసులు మరో అడుగు ముందుకేశారు. ఈ కేసులో ప్రధాన అనుమానితుడు రైస్‌మిల్లు మాధవరెడ్డి పరారీలో ఉండగా ఆయనకు సన్నిహితంగా ఉంటున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి అనుచరుల్లో ఒకరిని శనివారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మరో అనుచరుడు పోలీసుల విచారణకు స్వయంగా హాజరయ్యాడు. విశ్వసనీయ సమాచారం మేరకు..ఫైళ్ల దహనం కేసులో సీఐడీ పోలీసులు మాధవరెడ్డి బంధువులు, సన్నిహితులు, పనివాళ్లు, డ్రైవర్ల ఇళ్లలో సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసుల విచారణలో మదనపల్లె వైసీపీ ముఖ్యనాయకుల ప్రమేయం ఉందేమో అన్న కోణంలో శుక్రవారం అప్రమత్తం అయ్యారు. ఈ క్రమంలో స్థానిక పుంగనూరు రోడ్డులో నివాసం వున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి నివాసానికి శనివారం వేకువజామున 2 గంటలకు పోలీసులు వెళ్లి సోదాలు చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో జింకా వెంకటాచలపతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీంతో పాటు మండలంలోని తట్టివారిపల్లె బైపాస్ రోడ్డులో నివాసమున్న మిధున్‌రెడ్డి ముఖ్య అనుచరువు బాబ్‌జాన్ ఇంటి వద్దకు పోలీసులు వెళ్లారు. అక్కడ పోలీసులు పలుమార్లు తలుపు తట్టినా లోపలి నుంచి ఎటువంటి అలికిడి రాలేదని తెలిసింది. దీంతో ఉదయం 6 గంటలకు వరకు వేచి చూసిన పోలీసులు తిరిగి వచ్చేశారు. ఇదిలా ఉండగా మిధున్‌రెడ్డి మరో ముఖ్య అనుచరుడు, సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ సర్పంచ్ భర్త, వైసీపీ నాయకుడు, ఫ్రీలాన్స్ జర్నలిస్టు అక్కులప్ప స్వగ్రామమైన మిట్టపల్లెలోని ఆయన ఇంటికి వెళ్లి పోలీసులు సోదాలు నిర్వహించారు. అంతేకాకుండా అక్కులప్పను విచారణకు రావాల్సిందిగా పోలీసులు ఫోన్ చేయడంతో అక్కులప్ప స్వయంగా డీఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఈ కేసులో పోలీసుల విచారణకు తాను సహకరిస్తానని చెప్పడం గమనార్హం.

పరారీలో పెద్దిరెడ్డి అనుచరులు

మదనపల్లె పట్టణంలో శనివారం పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్యఅనుచరుల ఇళ్లలో పోలీసులు సోదాలు చేసి అదుపులోకి తీసుకున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిధున్‌రెడ్డిలకు వీరవిధేయులుగా ఉన్న వైసీపీ నాయకుల గుండెల్లో దడ మొదలైంది. ఈ క్రమంలో వైసీపీ నాయకులు ఒకరికి, మరొకరు ఫోన్లు చేసుకుంటూ ఎలా చేసేదంటూ పరామర్శించుకున్నట్లు సమాచారం. కొంత మంది అయితే ఇళ్లలో కుటుంబీకులకు చెప్పి బయట ప్రాంతాలకు పరారైనట్లు తెలిసింది. కనీసం వారి మొబైల్ ఫోన్లను కూడా తీసుకెళ్లకుండా ప్రత్యామ్నాయ ఫోన్లను తీసుకెళ్లినట్లు సమాచారం. ఏది ఏమైనా ఈ రెండు రోజుల్లో రాత్రిళ్ల పోలీసులు ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారు..? ఎవరిని అదుపులోకి తీసుకుంటారో..? అన్నదే పట్టణ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

శాంతి, స్థిరత్వాలను కాపాడటమే సీఆర్పీఎఫ్ లక్ష్యం

● డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, బ్రిగేడియర్ అనుపమ్ శర్మ



గౌరవ వందనం స్వీకరిస్తున్న అనుపమ్ శర్మ

కలికిరి, జూలై 27: దేశంలోని అన్ని ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వాలను కాపాడటమే లక్ష్యంగా సీఆర్‌పీఎఫ్ పనిచేస్తోందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, బ్రిగేడియర్ అనుపమ్ శర్మ ఉద్ఘాటించారు. కొన్ని నిర్దిష్ట పరిమితుల్లో కొనసాగిన సీఆర్పీఎఫ్ కార్గిల్ యుద్ధం తరువాత పాన్ ఇండియా ఉనికితో దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించిందని ఆయన చెప్పారు. స్థానిక పాలెం కొండ వద్ద సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సీఐఏటీ-3 (ఉగ్రవాద నిరోధక, తీవ్రవాద వ్యతిరేక శిక్షణ సంస్థ) ఆవరణంలో శనివారం జరిగిన 86 వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనురాగ్ శర్మ మాట్లాడుతూ 'నేషన్ ఫస్ట్.. ఏక్ భారత్ శ్రేష్ట్' అనే శాశ్వత నినాదానికి మాత్రమే సీఆర్పీఎఫ్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దేశం గర్వించదగ్గ స్థాయిలో ఇప్పటి వరకూ 2309 శౌర్య పతకాలను సాధించి అప్రతిహతంగా కొనసాగుతుండగా మరోవైపు మొత్తం 2255 మంది ధైర్య సాహసికులను దేశం కోసం అర్పించడం జరిగిందని గుర్తు చేశారు. 247 రెగ్యులర్ బెటాలియన్లు, 10 కోబ్రా బెటాలియన్లు, 16 ర్యాపిడ్ యూనియన్‌లతో సాయుధ సీఆర్పీఎఫ్ దుర్భేద్య స్థావరాలను కలిగి ఉందని తెలిపారు. అంకిత భావంతో, అకుంఠిత దీక్షాదక్షతలతో దేశ భద్రత కోసం కంకణం కట్టుకున్న వీర జవాన్లందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు చెప్పారు. మొదట అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం క్వార్టర్ గార్డ్ వద్ద గౌరవవందనం స్వీకరించారు. సమావేశం అనంతరం ప్రత్యేక సైనిక సమ్మేళనం, క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమాండెంట్ నీరజ్‌కుమార్ పాండే, సెకండ్ ఇన్ కమాండెంట్ ఇన్‌చార్జి కేబీకేఎస్ చౌదరి, డిప్యూటీ కమాండెంట్ అమరనాథ యాదవ్, జవాన్లు పాల్గొన్నారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

కడప(కలెక్టరేట్), జూలై 27: ఏపీపీఎస్సీ వివిధ నోటిఫికేషన్ల ద్వారా నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం అవుతాయని, ఆగస్టు 2వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కడప జిల్లా రెవెన్యూ అధికారి గంగాధరగౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8-30 గంటల నుంచి 9-30లోగా, మధ్యాహ్నం 1-30 నుంచి 2-30లోగా చేరుకోవాలన్నారు. మొత్తం 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

ప్రతి విద్యార్థి తన తల్లి పేరిట ఒక మొక్క నాటాలి

● డీఈవో శివప్రకాశ్ రెడ్డి



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన డీఈవో శివప్రకాశ్ రెడ్డి, ఉపాధ్యాయులు

పీలేరు, జూలై 27: సమాజంలోని ప్రతి విద్యార్థీ తన తల్లి పేరిట ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. 'శిక్షా సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగంగా అంతరించిపోతున్న అడవుల కారణంగా వాతావరణంలో అనూహ్య పరిణామాలు సంభవించి మానవ మనుగడకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. రోజురోజుకు ఓజోన్ పొర పలుచబడడం కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయన్నారు. చెట్ల పెంపకం ఒక్కటే వీటికి పరిష్కారమని, సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి విద్యార్థీ విరివిగా మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అంశాన్ని పాఠశాల స్థాయి నుంచే అలవాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో ఎకో క్లబ్బులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ క్లబ్బుల ద్వారా విద్యార్థులకు మత్తుపదార్థాల కలిగే అనర్థాల గురించి తెలియజేస్తామన్నారు. గత ఏడాది జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2.49 లక్షల మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది ఆ సంఖ్యను దాటుతామన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో 20 మందికి మించి విద్యార్థులు ఉన్నట్లయితే మరో ఉపాధ్యాయుడిని నియమిస్తామన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. ఆ తరువాత ఆయన స్థానిక జడ్పీ మెయిన్ పాఠశాలను కూడా సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవోలు పద్మావతమ్మ, లోకేశ్వర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం నటరాజన్, సీఆర్పీ మురళీధర్ రాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెదిరింపులు.. వినకపోతే అక్రమ కేసులు

● ఖాళీ బాండు పేపర్ల మీద సంతకాలు చేయించుకున్నారు
● పెద్దిరెడ్డి అనుచరుడి నుంచి వేధింపులు
● అవులపల్లె రిజర్వాయర్ భూనిర్వాసితుల ఆవేదన

మదనపల్లె టౌన్, జూలై 27: రిజర్వాయర్ కోసం మా భూములు ఇవ్వాలని పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు శశి బెదిరించాడు.. తాము వినకపోవడంతో పోలీసులతో అక్రమ కేసులు పెట్టించడంతో పాటు ఖాళీ బాండు పేపర్ల మీద సంతకాలు చేయించుకున్నాడని రైతులు సబ్ కలెక్టర్ ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుల భూదందాలపై బాధితులు మూడోరోజు శనివారం కూడా మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ వద్ద తమకు జరిగిన అన్యాయాలను ఏకరువుపెట్టారు. ముఖ్యంగా పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం ఆవులపల్లె రిజర్వాయర్ నిర్మాణం కోసం పెద్దిరెడ్డి అనుచరులు బలవంతంగా రైతుల నుంచి 165 ఎకరాల భూమిని లాక్కోవడం, వాటిని వైసీపీ నాయకుల పేరిట రాయించుకోవడంపై బాధిత రైతులు వారి ఆవేదన వెళ్లగక్కారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు మోహన్‌నాయుడు మాట్లాడుతూ బంగారుపాళెంకు చెందిన 11 మంది రైతులు చాలా ఏళ్ల క్రితం సోమల మండలం ఆవులపల్లె వద్ద 165 ఎకరాల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామన్నారు. మూడేళ్ల క్రితం అవులపల్లె రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని 165 ఎకరాల భూమిని తమ పేరిట రాసివ్వాలని పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు శశి తమను బెదిరించాడన్నారు. అందుకు తాము ఒప్పుకోకపోవడంతో యాదమరి మండలంలో ఉన్న మోహన్‌నాయుడు గ్రానైట్ క్వారీకి మైనింగ్ అధికారులను పంపి తప్పుడు కేసులుపెట్టి క్వారీని సీజ్ చేయించారన్నారు. అంతేకాకుండా ఫారెస్ట్ అధికారులను పంపి మోహన్‌నాయుడుపై క్రిమినల్ కేసులు నమోదు చేయించారన్నారు. గత్యంతరం లేక తామందరం పెద్దిరెడ్డి అనుచరుడు శశికి 100 రూపాయల ఖాళీ స్టాంపు పేపర్ల మీద సంతకాలు చేసి ఇచ్చామన్నారు. తమకు నష్టపరిహారం ఇవ్వాలని అడిగితే ఆవులపల్లె రిజర్వాయర్‌ను ఎన్‌జీటీ నిలిపివేసిందని, మీకు పరిహారం కాదు కదా ఒక్క రూపాయి కూడా ఇవ్వమని శశి బెదిరించాడన్నారు. మూడేళ్ల పాటు మా గోడును ఎవరికి చెప్పాలో దిక్కుతోచలేదని, ఇప్పుడు మదనపల్లెకు వచ్చి సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. దీనిపై విజయవాడకు వెళ్లి స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు వీజీ చంద్రశేఖర్ ఆచారి, కె.శ్రీనివాసులు, శ్రీకాంత్, ఆర్.జయంతి, ఆర్.గాయత్రి, సురేష్, వేణుగోపాల్, జగన్నాథం, జగదీష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఆవులపల్లె రిజర్వాయర్ బాధిత రైతులు



రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి



విగతజీవిగా పడి ఉన్న రెడ్డమ్మ (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

వల్లూరు, జూలై 27: మండల పరిధి పెద్దపుత్త గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెడ్డమ్మ (12)మృతి చెందిన ట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. సమాచారం మేరకు వివరాల్లోకెళితే... పొడ దుర్తి వాసులు సుబ్బరాయుడు, రుక్మిణమ్మ కుమార్తె రెడ్డమ్మ వెంకటాపురం గ్రామంలో ఉండి పెద్దపుత్త జడ్పీ హైస్కూల్‌లో 7వతరగతి చదువుతోంది. శనివారం పాఠశాల వదిలిన తరువాత సైకిలుపై ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టరు ఢీకొనడం తో రెడ్డమ్మ అక్కడిక క్కడే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ వెంకటరమణ సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి గల కారణాలను తెలియజేస్తామని పోలీసులు తెలిపారు. సంఘటలనా స్థలం వద్ద గ్రామస్తులు పెద్ద సంఖ్యలో గుమికూడారు.

విద్యుత్తు షాక్‌తో యువకుడు....



నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

ఖాజీపేట, జూలై 27: ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌కు గురవడంతో నీలం వెంకటసువార్ధన (20) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్లితే మేజర్ పంచాయతీ చెర్లోపల్లె వాసి వెంకటసువార్ధన కుళాయి నీటికి మోటారు బిగించి నీటిని పట్టేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్తు షాక్‌కు గురయ్యారు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

● నివాళులర్పించిన టీడీపీ నేతలు

యువకుడు విద్యుత్తు షాక్‌కు గురైన విషయం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు గ్రామస్థులు తెలపడంతో మండల టీడీపీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి మృతదేహంపై పూలగుచ్చం ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పిచ్చినాయుడు, సుబ్బరాయుడు, నాగేష్, రమణ, రాంప్రసాద్, చిన్న సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విలీనంతో కోల్పోయిన సౌకర్యాలను భర్తీ చేయాలి

● ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నరసయ్య

కడప (మారుతీనగర్), జూలై 27: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో కార్మికులు, ఉద్యోగులు కోల్పోయిన సౌకర్యాలను భర్తీచేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరస య్య డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యాలయం లో శనివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల భద్రత కోసం 2019లో టీడీపీ ప్రభుత్వం జారీచేసిన సర్క్యులర్ నెంబర్ 1-2019ను వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే పక్కన పెట్టిందన్నారు. ఉద్యోగుల శ్రేయస్సు దృష్ట్యా ఆ సర్క్యులర్‌ను తిరిగి అమలు చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం జయప్రదం కావాలంటే ఇప్పుడున్న కొద్దిపాటి బస్సులు సరిపో వన్నారు. విలీనం అనంతరం కారుణ్య నియామకాలు తప్ప ప్రత్యక్ష నియామకాలతో ఒక్క ఉద్యోగం కూడా భర్తీచేయలేదన్నారు. బస్సుల సంఖ్యను దశలవారీగా కుదించారని, ఆర్టీసీ బస్సుల స్థానంలో మరిన్ని అద్దె బస్సులను ప్రవేశ పెట్టారని ఆరోపించారు. జనవరి నుంచి చాలా మంది ఉద్యోగ విరమణ పొందుతున్నా ఆ ఖాళీలు భర్తీ చేయక పోవడంతో సంస్థ నష్టపోతోందన్నారు. తక్షణమే ఆ ఖాళీలను భర్తీచేయాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు పొదుపు చేసుకున్న ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ ట్రస్ట్ డబ్బు చెల్లించేలా ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు వున్న రిటైర్డ్ ఎంప్లాయిస్ మెడికల్ స్కీమ్‌ను ప్రస్తుతం రిటైర్డ్ అవుతున్న వారికి కూడా వర్తింప చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కె.కె. కుమార్, నాన్ ఆపరేషన్ కార్యదర్శి అంకిరెడ్డి, రంగనాథ్, జిల్లా కార్యదర్శి ఎ.ఆర్. మూర్తి, పలువురు యూనియన్, ఆరు డిపోల నేతలు పాల్గొన్నారు.

పోతిరెడ్డి పాడు ద్వారా నీళ్లు విడుదల చేయాలి

జాయింట్ కలెక్టర్‌కు ఏపీ రైతు సంఘం నేతల వినతి



జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నేతలు

కడప(కలెక్టరేట్) జూలై 27: శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డి పాడు రెగ్యులేటర్ ద్వారా నీళ్లు విడుదల చేసి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు శనివారం ఏపీ రైతు సంఘం నేతలు విన్నవించుకున్నారు. పోతిరెడ్డి పాడు సహా కేసీ కెనాల్, తెలుగు గంగకు నీరు విడుదలవడంతో రైతాంగానికి పంటల సాగుకు మేలు జరుగుతుందన్నారు. శ్రీశైలం జలాశయాఇకి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీరు చేరి డ్యామ్ నీటి మట్టం 870 అడుగులకు చేరుకుందన్నారు. వెంటనే పోతిరెడ్డి హెడ్‌లెగ్యులేటర్ ద్వారా నీరు విడుదల చేస్తే గాలేరు నగరి కాల్వ ద్వారా గోరుకల్లు, అవుకు, గండికోట ప్రాజెక్టుకు, తెలుగు గంగ, వెలుగోడు ప్రాజెక్టులు నిండి తాగు, సాగు నీరు ఇబ్బందులు అధిగమించ వచ్చన్నారు. రాయియల సీమ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అరకొరగా పంటల సాగు ఎండుదశకు వచ్చాయని, శ్రీశైలం నుంచి నీటి విడుదల వల్ల సీమ జిల్లాల్లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులు జలకళను సంతరించు కుంటాయన్నారు కేసీ కెనాల్ నుంచి నీరు వస్తోందని రైతులు కెనాల్ ఆయకట్టు కింద, బోరుబోవుల కింద పంటలు పెట్టేందుకు నారుమళ్లతో సిద్ధమయ్యారన్నారు. తక్షణమే ప్రజా ప్రతినిధులు, అధికారులు నీటి సలహా మండలి సమావేశం జరిపి ప్రభుత్వంపై వత్తిడి పెంచి స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని జేసీకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. జేసీని కలసిన వారిలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, సీఐటీయూఐ జిల్లా అధ్యక్షుడు కె .శ్రీనివాసులరెడ్డి రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనరు శివారెడ్డి తదితరులు ఉన్నారు.

"కేతు తలపులలో" సంచిక ఆవిష్కరణ నేడు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 27: "కేతు తలపులలో" స్మృతిసంచిక ఆవిష్కరణ సభ ఆదివారం నిర్వహిస్తున్నట్లు స్మృతి సంచిక సంపాదకులు పాలగిరి విశ్వప్రసాద్, నిర్వాహకులు కేతు శిరీష తెలిపారు. సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 9.30కి ఈ సభప్రారంభం అవుతుందన్నారు. తెలుగు సాహిత్య ప్రముఖులు అనేక మంది కేతు విశ్వనాథరెడ్డి గురించి, రాసిన వ్యాసాలతో పరిశోధక విద్యార్థులకు ఉపయుక్తంగా సంచిక రూపొందిందని తెలిపారు. ప్రముఖ కథా రచయిత దాదాహయాత్ అధ్యక్షతన జరిగే ఈ అవిష్కరణ సభలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుకొండ లక్ష్మీనారాయణ స్మృతి సంచికను ఆవిష్కరిస్తారన్నారు. ప్రముఖ రచయితలు మధురాంతకం నరేంద్ర, కాట్రగడ్డ దయానంద్ ప్రధాన ప్రసంగం చేసే ఈ సభలో, గౌరవ అతిథులుగా అరసం రాష్ట్రకార్యదర్శి వల్లూరు శివప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు, ప్రముఖ కథారచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, విశ్రాంత చరిత్ర అధ్యాపకులు యమ్మనూరు ప్రభాకరరెడ్డి, సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రం బాధ్యులు టి.రాంప్రసాదరెడ్డి, అరసం జిల్లా అధ్యక్షుడు ఎస్.ఈశ్వరరెడ్డి పాల్గొంటారని విశ్వప్రసాద్, కేతుశిరీషలు తెలిపారు.

1400 కుక్కలకు సంతతి నియంత్రణ

కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు ● రోజుకు పది కుక్కలకు పైగా ఆపరేషన్లు
యాంటి రేబిస్ వ్యాక్సిన్ సైతం ఇస్తున్న వైనం ● అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్లో సంరక్షణ



కుక్కకు ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు, జూలై 26: ఎక్కడ చూసినా కుక్కల బెడద తీవ్రంగా పెరిగిపోతోంది. ఇటీవల కుక్కల దాడులతో అనేక మంది పిల్లలు, పెద్దలు తీవ్రగాయాలపాలైన సందర్భాలూ ఉన్నాయి. వాహనదారులు ప్రమాదాలకు గురైన సమయాలు అనేకం. గతంలో కుక్కల సంతతి ఎక్కువైతే పట్టుకుని చంపేసే వారు. అయితే సమాజంలో ఏ జంతువు, వన్యప్రాణి ప్రాణం తీసే అధికారం ఎవరికీ లేదని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పల్లెలు, పట్టణాలు అనే తేడాలేకుండా కుక్కల సంతతి పెరిగిపోయింది. దీంతో వాటిదాడులు మరీ ఎక్కువయ్యాయి. ఫలితంగా పలుసందర్భాల్లో పిల్లలు పెద్దల ప్రాణాలకే ప్రమాదం పొంచి వున్న పరిస్థితులు దాపురించాయి. తల్లిదండ్రులు ధైర్యంగా పిల్లలను రోడ్లమీదికి పంపలేని పరిస్థితి నెలకొంది. అయితే కుక్కల సంతతిని నియంత్రణ చేపట్టేందుకు ప్రభుత్వం కుక్కలను పట్టుకుని సంతతి నియంత్రణ కోసం శస్త్రచికిత్స చేయడం మొదలు పెట్టారు. ఇందులో భాగంగా ప్రొద్దుటూరు మున్సిపల్ అధికారులు రోజుకు పదికి పైగా కుక్కలకు సంతతి నియంత్రణ శస్త్రచికిత్స చేయడం ప్రారంభించారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 5వేల నుంచి 7 వేల వరకు కుక్కల సంతతిని మున్సిపల్ ప్రజా ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. పొట్టిపాడు రోడ్డులోని కంపోస్ట్ యార్డులో గతేడాది నవంబరు 18న అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. పట్టణంలో కుక్కలను ప్రత్యేక టీంతో పట్టించి వాటికి స్టెరిలైజేషన్ చేస్తున్నారు. ఆపరేషన్లు చేశాక వాటికి వారం రోజుల పాటు ఆహారం పెట్టి సంరక్షిస్తారు. వాటికి మందులు వాడి కుట్లు మానిపోయాక వాటిని మళ్ళీ పట్టణంలో వదులుతున్నారు.

యాంటి రేబిస్ వ్యాక్సినేషన్

అనిమల్ బర్త్ సెంటర్‌లో కుక్కలకు అంటీ రేబిస్ వ్యాక్సినేషన్ ప్రక్రియ కూడా చేపడుతున్నారు.



కుక్కను పట్టుకుంటున్న సిబ్బంది

ఇందువల్ల కుక్క కరిచినా వెంటనే ర్యాబిస్ వ్యాధి సోకకుండా చర్యలు తీసుకుంటున్నారు.

1400 కుక్కలకు స్టెరిలైజేషన్

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో రోజుకు పది కుక్కల వంతున పట్టి అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలిస్తారు. వాటికి రోజూ అక్కడ ఆహారం పెడతారు. ఉదయం రేబిస్ వ్యాక్సినేషన్ చేస్తారు. సాయంత్రం స్టెరిలైజేషన్ చేస్తున్నారు. ఈ సెంటర్‌లో ఇప్పటి వరకు 1400 వందల కుక్కలకు స్టెరిలైజేషన్ చేశారు. ఒక్కో కుక్కను పట్టినందుకు వాటికి యాంటి ర్యాబిస్ వ్యాక్సినేషన్ వేయడానికి స్టెరిలైజేషన్ ట్రాన్స్‌పోర్టేషన్‌కు మొత్తం కలిపి రూ. 1347 మున్సిపాలిటీ చెల్లిస్తోంది. ఇప్పటి వరకు కుక్కల నియంత్రణకు మున్సిపాలిటీ రూ. 18,85,800 ఖర్చుచేసింది.

కుక్కల నియంత్రణ నిరంతర ప్రక్రియ

కుక్కల నియంత్రణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. ప్రొద్దుటూరులో దాదాపు 5 వేలకు పైగా కుక్కలు వున్నట్లు సర్వేలో గుర్తించాము. అందులో 2023 నవంబరు నుంచి ఇప్పటి వరకు 1400 కుక్కలకు స్టెరిలైజేషన్ ఆంటీర్యాబిస్ వ్యాక్సినేషన్ చేపట్టాము. ఏ ప్రాంతంలో ఎక్కువ కుక్కలు వున్నాయో ఆ ప్రాంతానికి వెళ్లి వాటిని పట్టి మొదట ఆపరేషన్లు చేస్తున్నాము. ఇది నిరంతరం చేపట్టవలసిన ప్రక్రియ. దానిపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నాము. ప్రత్యేకంగా సిబ్బందిని సైతం ఏర్పాటు చేశాం

రఘునాథరెడ్డి మున్సిపల్ కమిషనర్

రేపు 'సర్వరాయ సాగర్'లోని మత్స్య సంపద వేలం

కడప(రూరల్) జూలై 27: సర్వరాయసాగర్ రిజర్వాయరులో మత్స్య సంపద అమ్మేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు మత్స్య అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. వీరపునాయునిపల్లె మండలం కొమ్మద్ది పరిధిలోని సర్వరాయ సాగర్ రిజర్వాయర్‌లో 2024 జూలై 1 నుంచి 2025 జూన్ 30 వరకు చేపలు పట్టుకుని అమ్ముకునేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10-30 గంటల నుంచి 1-00 గంట వరకు కొమ్మద్ది సచివాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగి వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు, నకలు, రూ. 10,000 రుసుం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ప్రభుత్వం 1434వ పసలీకు నిర్దేశించిన రిజర్వాయర్ గుత్త పైకము మొత్తం రూ. 2,93,113లు నుంచి వేలం మొదలవుతుందని తెలిపారు.

కులంపేరుతో దూషించారని కేసు నమోదు

రామాపురం, జూలై27: కల్పనాయునిచెరువు పంచాయతీ గాలంగుండ్లపల్లె హరిజనవాడ వాసి కాసిపోగుల సోనియాను చరసాల దిలీప్ కులం పేరుతో దూషించాడని ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోనియా అడపలమాలపల్లె చర్చిలో జరుగుతున్న ఉత్సవాలకు వెళ్లేందుకు 26వ తేదీ ఉదయాన్నే వ్యాన్‌లో అగ్రహారం హరిజనవాడకు వెళ్లి స్థానికులను చర్చికి తీసుకెళ్లేందుకు వ్యాన్‌లో ఎక్కించుకు వస్తుండగా గ్రామస్థుడు దిలీప్ వ్యాన్‌ని అడ్డగించారు. ఎక్కడికి తీసుకెళ్తున్నారని సోనియాను అడగ్గా చర్చికి తీసుకెళుతున్నారని చెప్పడంతో అందరినీ మత మార్పిడి చేస్తున్నట్లుగా ఆమెను దిలీప్ నిలదీశాడు. అనతరం ఆమెను కులం పేరుతో దూషించారని శనివారం రామాపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా దిలీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్లారిఫైయర్‌లో పడి ఆర్టీపీపీ జేపీఏ మృతి



ఎర్రగుంట్ల జూలై27: ఆర్టీపీపీ డీఎం ప్లాంట్ జేపీఏ హుస్సేన్ బాష (45) శుక్రవారం రాత్రి క్లారిఫైయర్‌లో పడిమృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈయన స్టేజ్ వన్ డీఎం ప్లాంట్‌లో శాంపుల్ సేకరించి పరీక్షలు చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి శాంపుల్ తెచ్చేందుకు క్లారిఫైయర్ దగ్గరకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైవీయూలో డిగ్రీప్రవేశాలకు వెబ్‌ఆప్షన్లు ప్రారంభం

కడప (ఎడ్యుకేషన్), జూలై 27: వైవీయూ డిగ్రీ కోర్సుల్లో రిజిస్ట్రేషన్ అయిన విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకుని ప్రవేశాలు పొందాలని వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ తెలిపారు. డిగ్రీ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యుల్ ఫర్ డిగ్రీకాలేజీస్ వెబ్‌ఆప్షన్ మొదలైందన్నారు. 29 వరకు కొనసాగుతుందన్నారు. డీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బీకాం కంప్యూటర్స్, హానర్స్ కోర్సులు ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించామని తెలిపారు. బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్‌ఫర్‌మేటిక్ అప్లైడ్ జియాలజీ బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి వైవీయూ కళాశాలలను విద్యార్థులు ఎంపిక చేసుకోవాలని సూచించారు. అకడమిక్ పరిశోధనల పరంగా జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగి వైవీయూ నాణ్యమైన విద్యనందిస్తుందని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బెస్ట్ టీచర్స్ అవార్డులకు 5లోగా దరఖాస్తు చేసుకోండి

రాయచోటిటౌన్, జూలై27: రాష్ట్ర, జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, సాంఘిక సంక్షేమ, మున్సిపల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 2024 రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మూడు సెట్లు ఆగస్టు 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయంలో, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు డీవైఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. విద్యాశాఖ అధికారులు పరిశీలించి ఆగస్టు 10వ తేదీలోగా డీఈఓ కార్యాలయానికి అందజేయాలని ఆయన సూచించారు. దరఖాస్తు దారులు బోధనలో కనీసం 15 ఏళ్ల అనుభవం ఉండాలని, రాష్ట్ర అవార్డుకు గతంలో జిల్లా స్థాయి అవార్డు పొంది ఉండాలన్నారు. ఉపాధ్యాయులపై ఎటువంటి క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌శాఖా పర క్రమశిక్షణ చర్యలు ఉండరాదన్నారు. జాతీయ స్థాయి అవార్డుకు దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు రాస్తా అవార్డులకు దరఖాస్తు చేయకూడదన్నారు. అన్నమయ్య జిల్లా పరిధి ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారం రాష్ట్ర, జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో సూచించారు.

వైవీయూలో పలు విభాగాల తనిఖీ



ఫైళ్లను పరిశీలిస్తున్న రిజిస్ట్రారు

కడప (ఎడ్యుకేషన్), జూలై 27: వైవీయూలోని పలు విభాగాలను కులసచివులు ఆచార్య రఘునాథరెడ్డి శనివారం తనిఖీ చేశారు. పలు విభాగాల్లో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విశ్వవిద్యాలయ అతిధిగృహాల వార్డెన్లతో సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో పబ్లిక్ రిలేషన్ సెల్‌తో సమీక్షించారు. పీఆర్ సెల్ సంచాలకులు డాక్టర్ ఎస్వీ సుబ్బారెడ్డి అవసరాలను రిజిస్ట్రార్ దృష్టికి తెచ్చారు.

ఇటు 'కేసీ' సాగదా

● నీటికోసం ఎదురుచూపులు
● భూములు దున్ని సిద్ధంగా ఉన్న రైతులు



చాపాడు వద్ద చాపాడు చానెల్ - మైదుకూరు వద్ద కేసీ కెనాల్

చాపాడు, జూలై 27: ఈ ఖరీఫ్ సీజన్‌లో చాపాడు, దువ్వూరు, మైదుకూరు, ఖాజీపేట మండలాల భూములకు కేసీ కెనాల్ నీరు సాగదా అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. మండలాల్లోని భూములకు ప్రధాన జలవనరు కేసీ కెనాల్. ఈఏడాది ఖరీఫ్ సాగుకు రైతాంగం కేసీ కెనాల్ సాగు నీటికోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తోంది.

వ్యవసాయానికి, పాడిపరిశ్రమకు గుండెకాయలాంటి కేసీ కెనాల్ నీటితోనే మైదుకూరు నియోజకవర్గం రైతులు జీవనం సాగిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి, పత్తి, వేరుశనగ, నువ్వులు వంటి రకాల పంటలు సాగు చేస్తారు. జూన్, జూలై నెలల్లో కాల్వలకు సాగునీరు రాగానే వరి నారుకయ్యలు వేస్తారు. కేసీ కెనాల్‌కు ఉపకాల్వలుగా చాపాడు చానెల్, ఏటూరు కాల్వలున్నాయి. ఏటా చాపాడు మండలంలో సుమారు 25 వేల ఎకరాల్లో, దువ్వూరులో 14 వేల ఎకరాలు, మైదుకూరులో 8 వేల ఎకరాలు, ఖాజీపేటలో 12 వేల ఎకరాలు వరి పంట సాగు చేస్తారు. జిల్లాల్లో చాపాడు మండలంలో 25 వేల ఎకరాల్లో వరిపైరు సాగు చేయడం విశేషం. లక్ష్మీపేట, కేతవరం, చాపాడు, భద్రిపల్లె, ఖాదర్‌పల్లె, అన్నవరం, చియ్యపాడు తదితర గ్రామాల పరిధిలో రైతులు దుక్కి దున్ని భూములను సిద్ధంగా ఉంచారు. కానీ ఈ ఏడాది ఇప్పటికీ కాల్వలకు సాగునీరు రాకపోవడంతో రైతులు నారుకయ్యలు వేయలేదు. గతేడాది కేసీ కెనాల్‌కు సాగునీరు రానందున ఆరుతడి పైర్లు జొన్న, కొర్ర, కంది, పెసర వంటి పంటలు సాగు చేసి అసంతృప్తితో ఉన్నారు. ఈ ఏడాది ఈ నాలుగు మండలాల్లో రైతులు సుమారు 63 వేల ఎకరాల్లో వరి పైరు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం 866 అడుగులకు పైగా ఉందని అధికారులు పేర్కొన్నారు. కానీ 850 అడుగులు నీరు ఉంటేకానీ కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేసే అవకాశం ఉంది. శ్రీశైలం రిజర్వాయర్‌లో పుష్కలంగా నీళ్లు ఉన్నందున రైతులు ధైర్యంగా ఉన్నారు. ఈ ఏడాదైనా కాల్వలకు సాగునీరు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే రైతులు వరి విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. వరిపైరుకు పచ్చిరొట్ట ఎరువుగా వేసేందుకు జనుము, జీలుగలు చాలా మంది పెంచుతున్నారు. వరి పైరు సాగు చేసేందుకు జూలై, ఆగస్టు నెలల్లో మంచి అదును. ఈ అదునులో సాగు చేస్తే పంట మంచి దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ఈ అదును దాటితే దిగుబడి చాలా తగ్గే అవకాశాలున్నాయి. కేసీకెనాల్‌కు సాగునీరు విడుదల చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబును కోరాలని రైతులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను కోరుతున్నారు.



దుక్కి దున్ని నారుమడికి సిద్ధం చేసిన భూములు

నీటిని విడుదల చేయించాలి



శ్రీశైలం రిజర్వాయర్ నుంచి సాగునీటిని కేసీ కెనాల్‌కు విడుదల చేసేందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కృషి చేయాలి. ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులంతా పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. జూలై, ఆగస్టు నెలలు వరి పంట సాగుకు అదును. కేసీ సాగునీటితో రైతులు వరి పైరు సాగు చేస్తారు. సాగునీటికోసం రైతులంతా ఎదురుచూస్తున్నాం.

వీరారెడ్డి, రైతు, రాజువారి పేట గ్రామం

కాలువలకు నీటిని విడుదల చేయాలి



కేసీకెనాల్‌కు, చాపాడు చానెల్‌కు ప్రభుత్వం సాగునీటిని వెంటనే విడుదల చేయాలి. ప్రస్తుతం మండలంలోని భూములన్నీ బీడు బారాయి. వేరుశనగ, వరి, నువ్వులు, పసుపు వంటి పంటలకు కేసీ నీరే ఆధారం. నారుకయ్యలు వేసేందుకు ఎన్‌డీఎల్ఆర్, జిలకర, 999 వరి విత్తనాలను రైతులు కొనుగోలు చేస్తున్నారు. శ్రీశైలంలో నీళ్లు ఉన్నందున విడుదల చేయాలి.

దేవసహాయం, రైతు, కేతవరం గ్రామం

ఆదర్శప్రాయుడు ఏపీజే అబ్దుల్‌కలాం


రాజంపేట: డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటుతున్న బీజేపీ నేతలు


పెనగలూరు: అబ్దుల్‌కలాం జీవిత చరిత్ర వ్యాసరచన, చిత్రలేఖనం విజేతలతో బీజేపీ నేత సాయి లోకేశ్ తదితరులు

రాజంపేట, జూలై 27 : ప్రపంచం మెచ్చిన గొప్ప మేధావి మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. శనివారం అబ్దుల్‌కలాం 9వ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ బాలికల పాఠశాలలో మొక్కలు నాటారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్‌కలాం అణు, శాస్త్రీయ రంగాలకు స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. కలలు కనండి.. వాటి సాకారం కోసం కష్టపడండి అని చెప్పిన వ్యక్తి కలాం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు రమణయ్య, వీరప్రసాద్, బీజేపీ నేతలు ఆదినారాయణ, షేక్ అబ్దుల్లా, టి.హరిప్రసాద్, శ్రీనివాసులు, పి.సూర్యచంద్ర, నవీన్‌కుమార్, తోట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: పట్టణంలోని అబ్దుల్ కలాం విగ్రహానికి మున్సిపల్ ఛైర్మన్ షేక్ ఫయాజ్‌బాషా గజమాల వేసి నివాళులు అర్పించారు. కౌన్సిలర్లు అల్తాఫ్, గౌస్‌ఖాన్, ఈశ్వర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: ప్రతి విద్యార్థి అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలని అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. శనివారం పెనగలూరు ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. మైనార్టీమోర్చా జిల్లా అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, నాయకులు సునీత, నారాయణ, పోతుగుంట నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు వి.శివారెడ్డి, వీహెచ్‌పీ నేతలు కె.నారాయణ, బి.గంగయ్య, టీడీపీ అధికార ప్రతినిధి కొత్త బాలక్రిష్ణ, వై.హరిబాబు, ఎం.శ్రీనివాసులు, కె.శ్రీరాం, రమణయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మల్లికార్జున ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు రాజయ్య, సుకన్య, ఇంద్రావతి, సురేంద్ర, ప్రసాద్, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, బాలశేఖర్‌లు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: తల్లెంవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి మొక్కలు నాటారు. విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. నాయకులు వాకచర్ల సుబ్బారావు, చిన్నిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఊటుకూరు చలపతి, సుబ్బరాయుడు, పోకల బాలాజీ, సుబ్రమణ్యం, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : అణు సామర్థ్యంలో భారతదేశం తక్కువ కాదని నిరూపించిన గొప్ప శాస్త్రవేత్త మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం అని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు అన్నారు. శనివారం అబ్దుల్ కలాం 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నేతలు, రోడ్డు రవాణా, రాష్ట్ర మాజీ డైరెక్టర్ గుల్జార్‌బాషా, కోవూరు సుబ్రమణ్యంనాయుడు, దగ్గుపాటి మణి, ఎస్‌కే కరీం, జిలానిబాషా, తుపాకుల బాషా తదితరులు పాల్గొన్నారు.

2వ తేదీ మధ్యాహ్నంలోపు పింఛన్లు పంపిణీ చేయాలి

రామాపురం, జూలై27: మండలంలో పింఛన్‌దారులకు 2వ తేదీ మధ్యాహ్నం లోపల పంపిణీ చేయాలని ఎంపీడీవో ప్రభాకర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ సర్వర్ 1వ తేదీ నుంచి 2వ తేదీ మధ్యాహ్నం వరకు పనిచేస్తుందని పింఛన్‌దారులు 1వ తేదీ లేదా 2వ తేదీ మధ్యాహ్నంలోపు అందుఆటులో ఉండి పింఛన్లు పొందాలన్నారు. అనంతరం సర్వర్‌పని చేయదని తెలిపారు. సచివాలయ సిబ్బంది పింఛన్ దారులకు సకాలంలో పింఛన్లు అందజేయాలని వారికి ఆయన సూచించారు.

ఆదివారం విద్యుత్‌బిల్లులు చెల్లించవచ్చు

లక్కిరెడ్డిపల్లె జూలై 27: లక్కిరెడ్డిపల్లె, రామాపురం, వీరబల్లి మండలాల విద్యుత్ వినియోగదారులు ఆదివారం కూడా విద్యుత్‌చార్జీలు చెల్లించవచ్చని జూనియర్ అకౌంట్ ఆఫీసర్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం వసూళ్ల కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని వివరించారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ మాజీ వీఆర్వో మృతి

పెనగలూరు, జూలై 27: పెనగలూరు విశ్రాంత వీఆర్వో కుందవరం రామలింగయ్య ఇటీవల ప్రమాదానికి గురై ఇంటిలోనే చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతిచెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. రామలింగయ్య 1977 నుంచి పెనగలూరు, సిదవరం, సింగరాజపురం గ్రామాలకు కరణంగాను, వీ వో, వీఆర్వోగా పనిచేశారు. అనంతరం పెనగలూరులోని నాయినాదేశ్వరస్వామి ఆలయం, ఇండ్లూరులోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తుండేవారు. నాలుగురోజుల క్రితం పెనగలూరు శివాలయంలో పూజలు చేస్తూ జారి పడ్డారు. అప్పటి నుంచి ఇంటివద్దే ఉండి చికిత్స తీసుకుంటూ శనివారం తెల్లవారుజామున నిద్రలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులుతెలిపారు. ఆదివారం ఉదయం పెనగలూరులోని ఆయన స్వగృహంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గురుకుల పాఠశాలలో శిక్షా సప్తాహ్

ఓబులవారిపల్లె, జూలై 27 : మండలంలోని సంజీవపురం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మన్సూరు అలీ ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ నిర్వహించారు. 9, 10 తరగతుల విద్యార్థులకు చార్ట్స్, రోల్‌ప్లే బోర్డు తదితరాలు విద్యార్థులతో తయారు చేయించి ప్రదర్శించారు. ఈ విభాగంలో శిక్షణ పొందిన విద్యార్థులు భవిష్యత్తు లో స్వయం ఉపాధి పొందవచ్చునని శిక్షణ నిర్వాహకులు అంకిపల్లె శివకుమార్ తెలిపారు. మెరుగైన ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ మన్సూర్ అలీ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయంలో పూజలు

గాలివీడు, జూలై 27: మండల కేంద్రంలోని బ్రాహ్మణ వీధిలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఆనంద్ ఆచార్యులు స్వామి వారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, తులసీ దళాలతో పూజలు చేశారు. శ్రావణమాసాల్లో శ్రీవారి పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

తహసీల్దారుకు సన్మానం

రామాపురం, జూలై 27: ఎన్నికల సమయంలో రామాపురం రెవెన్యూ కార్యాలయానికి తహసీల్దార్‌గా శ్రీనివాసులు వచ్చారు. ఎన్నికల అనంతరం తిరిగి శనివారం సత్యసాయిజిల్లాకు బదిలీపై వెళ్లారు. కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఈ జిల్లాకు వచ్చినప్పటికీ స్థానికంగా అధికారులు, సిబ్బంది, ప్రజలు సహకరించడం సంతోషకరమన్నారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం



పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

సంబేపల్లె, జూలై27: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా మొక్కలు నాటుదాం- పర్యావరణాన్ని కాపాడుకుదాం అని ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. సంబేపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం 'అమ్మ పేరుతో ఒక మొక్క' నినాదంతో తమ తల్లులతో కలిసి విద్యార్థులు మొక్కలు నాటారు. స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. భూ మండలంపై కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రాణవాయువు శాతాన్ని పెంచేందుకు, వర్షాలు పడేందుకు, విపత్తుల సమయంలో చెట్లు ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. విభిన్న ఆకారాలలో ఉన్న పత్రాలను సేకరించి వాటికి రంగులు పూసి విద్యార్థులతో ప్రదర్శన చేశారు. అనంతరం ప్రకృతి పరి రక్షణపై గీతాలు ఆలపించారు. నాటికలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు శంకరయ్య, రెడ్డెయ్యరెడ్డి, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుండుపల్లె: మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని నియంత్రించవచ్చునని మండల విద్యాశాఖ అధికారి-2 రవీంద్రనాయక్ తెలిపారు. శనివారం సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయుడు జయన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్రరాజు, ఎస్‌టీయూ నాయకులు ఆరీఫుల్లా, జనసేన నాయకులు రామశ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి పాఠశాల ఆవరణలో జామ, సపోట, కొబ్బరి, ఉసిరి, మామిడి మొక్కలు నాటారు. అనంతరం ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశా రు. కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపాల్ నాగయ్య, విజయకుమారి, శ్రీనివా సులు విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లంపేట : దళవాయిపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు వారి తల్లులతో కలిసి 50 పైగా మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయులు రమణ, ఈశ్వరయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం

సిద్దవటం, జూలై 27 : పండ్ల తోటల సాగుతో లాభాలను పొందాలని ఉద్యానవనశాఖ అధికారి జయభరత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రమైన సిద్దవటం, మండల అభివృద్ధి కార్యాలయం, సభాభవనంలో శనివారం ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు అధ్యక్షతన పండ్ల తోటల సాగుపై సమావేశం నిర్వహించారు. ఏడీఏ నాగరాజు, డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, ఏవో రమేష్‌రెడ్డి, ఏపీవో నరసింహులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద రైతులు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు మాట్లాడుతూ మండలంలో ఉన్న రైతులందరూ పండ్లతోటలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ మంత్రిని కలిసిన రెడ్డెయ్య


మంత్రి సంధ్యారాణిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న అమావాస్య రెడ్డెయ్య

రాయచోటిటౌన్, జూలై27: ఆంధ్రప్రదేశ్ స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని టీడీపీ ఎస్టీ సెల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అమావాస్య రెడ్డెయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం రాత్రి ఆయన అమరావతిలో మంత్రిని కలిసి అన్నమయ్య జిల్లా లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమెకు వివరించారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఉన్న ఎస్టీ సామాజిక వర్గం స్థితిగతులను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా పరిధిలో ఎస్టీ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని ఆమెను కోరినట్లు తెలిపారు. నాయకులు మనోహర్‌నాయక్, మొగిలి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోలాహలంగా విగ్రహాల ఊరేగింపు


విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

పెనగలూరు, జూలై 27: మండల కేంద్రంలోని టి.కొత్తపల్లెలో నిర్మించిన కార్యసిద్ధి వినాయకస్వామి దేవాలయంలో ప్రతిష్ఠించేందుకు తిరు పతి నుంచి తీసుకు వచ్చిన రాతి విగ్రహాలు, ఉత్సవ విగ్రహాలను శనివారం సాయంత్రం ఉన్నత పాఠశాల సమీపం నుంచి గ్రామ ప్రజలు, యువకులు కోలాహలంగా గ్రామంలోనికి తీసుకెళ్లారు.మూలవిరాట్‌ను కొత్తపల్లెకు చెందిన తలమంచి రమణారెడ్డి కుటుంబ సభ్యులు, ఉత్సవ విగ్రహాలను మేగడ విశ్వనాధ్‌రెడ్డి కుటుంబ సభ్యులు, ద్వార పాలకులను లక్ష్మీనరసింహ కుటుంబ సభ్యులు దేవాలయానికి సమర్పించుకున్నారు. వీటితో పాటు మకరతోరణం ద్వార పాలకులు, కంచు గంటలను కూడా ఈ కార్యక్రమంలో ఊరేగించారు. ఇదిలా ఉండగా వచ్చే నెల 7వ తేదీ నుండి పూజా కార్యక్రమాలతో దేవాల యంలో వీటిని ప్రతిష్ఠించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతి ప్రదానం

వీరబల్లి, జూలై 27: మండల పరిధిలోని పెద్దివీడు పంచాయతీ పూర్వపు ప్రధానోపాధ్యాయులు రవీంద్రబాబు ఆధ్వర్యంలో గ్రంధేవాండ్లపల్లె, రెడ్డివారిపల్లె జెడ్పీహెచ్‌ఎస్ స్కూళ్లలో 2023-24లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.3,116లు, ద్వితీయ బహుమతి రూ.2,116లు, తృతీయ బహుమతి రూ.1,116 ప్రదానం చేశారు. 500పైగా మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. అనంతరం అక్కడి బోధన సిబ్బందిని ఘనంగా సన్మానించారు.

మంత్రి ఆదేశాలతో బోరు ఏర్పాటు

చిన్నమండెం, జూలై 27: మండలంలోని బెల్లంవాండ్లపల్లె లో తాగునీటి సమస్యను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, సమస్య పరిష్కరించాలని ఆయన అధికారు లను ఆదేశించారు. దీంతో జిల్లా పరిషత్ నిధులతో శనివారం బోరు వేశారు. అయితే ఈ బోరులో నీరు పుష్క లంగా పడడంతో గ్రామస్తులు మంత్రికి దన్యవాదాలు తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడిపై చర్యలకు డిమాండ్

లక్కిరెడ్డిపల్లె, జూలై 27: విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న రవీంద్రనగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును వెంటనే సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అఖిలభారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను వేధించడం బాధాకరమన్నారు

తాగునీటి సమస్య పరిష్కరించండి


ఖాళీ బిందెలతో ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

నందలూరు, జూలై 27 : తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ మండలంలోని కుందానెల్లూరులో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. గతంలో కలెక్టరుకు తమ సమస్య విన్నవించగా రూ. 12 లక్షలు నిధులు మంజూరు చేయగా, కాంట్రాక్టర్ 7.58 లక్షల రూపాయలు ఖర్చు చేసి బోరు, మీటరు, పైపులైను ఏర్పాటు చేశాడన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను కోసం రూ.2.56 లక్షలు మంజూరుకు డీఎంఎఫ్ అధికారులు జాప్యం చేయడంతో పనులు ఆగిపోయాయన్నారు. దీంతో దాదాపు రెండు కిలోమీటర్ల నుంచి నీరు తెచ్చుకుని తాగుతున్నామని ఇప్పటికైనా కలెక్టర్, డీఎంఎఫ్ అధికారులు సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరారు.

వీరబల్లి: మండలంలోని వంగిమళ్ల గ్రామ కస్పాలో ప్రజలు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారని వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి, వీరబల్లి జనసేన మండల నాయకుడు అలీకుమార్, మండల అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా గ్రామాల్లో ఫ్లోరైడ్ నీరు తాగి వ్యాధులబారిన పడుతున్నారని తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ సమస్య శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

చేనేత కుటుంబం ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, జూలై 27 : మండలంలోని కొత్త మాధవరానికి చేనేత కార్మికుడు పాల సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యపై క్షేత్ర స్థాయిలో సమగ్ర విచారణ చేయాలని రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య అన్నారు. శనివారం స్థానిక హరిత హోటల్‌లో మండల టీడీపీ నాయకులతో కలిసి పత్రికా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసు, రెవెన్యూ అధికారులు మొక్కుబడిగా విచారణ చేశారని, కేసు నీరుగార్చేందుకు అప్పుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని డీఎస్పీ ప్రకటించాడని ఆరోపించారు. మండల వ్యాప్తంగా పెద్దఎత్తున వైసీపీ నాయకులు నకిలీ భూపట్టాలతో ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నారని, వీటిపై సమగ్ర విచారణ చేయాలన్నారు. చేనేత కుటుంబం అయిన సుబ్బారావు కుటుంబాన్ని టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఆదుకుంటామని అప్పటి యువ నాయకులు లోకేష్ హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు ఆ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. త్వరలో వారికి నష్టపరిహారం అందజేసి నారా లోకేష్ మాట నిలబెట్టుకుంటారన్నారు. మండలంలో రెవెన్యూ, పోలీసు శాఖల్లో ఇప్పటికీ వైసీపీ అనుకూలంగా పనిచేస్తున్నారని, ఇసుక భూ మాఫియా మండలంలో ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మోదుగుల నరసింహులు, మామిళ్ల శ్రీహరి, మామిళ్ల ఈశ్వరయ్య, రేవిళ్ల బాలమునెయ్య, బోగా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వం


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీధర్

రైల్వేకోడూరు, జూలై 27: జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో 60 మంది పైచిలుకు వలంటీర్లు ఉన్నారని, వారితో సభ్యత్వాలు చేయిస్తున్నారన్నారు. వలంటీర్లకు స్వయంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫోన్ చేసి మాట్లాడారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారుమంచి సంయుక్త, నాయకులు పగడాల వెంకటేష్, పగడాల చంద్రశేఖర్, వరికూటి నాగరాజు, బీదం నవీన్‌కుమార్, యర్రజున్నుగారి చలపతి, రాగిపాటి విజయ్, కొండేటి రమణ, వెంకటరమణారెడ్డి, అన్నెపు మహేష్, రాజ, హరి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, జూలై 27 : రీచ్‌లు గుర్తించని ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాను నివారించాలని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు కోరారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్మాణరంగం పూర్తిగా కుదేలైందన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఉచిత ఇసుక పాలసీ తెచ్చారన్నారు. ప్రభుత్వం స్థానికరీచ్‌లు గుర్తించేంతవరకు ఇసుక అక్రమ రవాణాను ఎక్సైజ్, పోలీసు అధికారులు నివా రించాలని తెలిపారు. త్వరలోనే రాజంపేటకు ఇసుక రీచ్ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామని, త్వరగానే అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుల్జార్‌బాషా, కోవూరు సుబ్రమణ్యం, దగ్గుపాటి మణి, సతీష్‌రాజు, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కే కరీం, మాజీ కౌన్సిలర్ జిలానిబాషా, తుపాకుల భాషా తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలను ఉద్యోగులుగా గుర్తించాలి


మాట్లాడుతున్న గంగాధర్

రైల్వేకోడూరు, జూలై 27: ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాదరాజు గంగాధర్ తెలిపారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఆశాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు పెండింగ్‌లో ఉన్న అలవెన్సులు తక్షణం చెల్లించాలన్నారు. సాధారణ సెలవులు, మెటర్నిటీ సెలవులు ఇవ్వాలన్నారు. అలవెన్సులు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశాలు మరణిస్తే ఖర్చులకు రూ. 25 వేలు ఇవ్వాలని, మెడికల్ ఉద్యోగులు గా గుర్తించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయసును 62కు పెంచి, ఏఎన్‌ఎంలుగా పదోన్నతి ఇవ్వాలన్నారు. మలేరియా అధికారులు గతంలో జిల్లాలో పంపిణీ చేసిన దోమతెరల మొత్తాన్ని ఇవ్వలేదన్నారు. యశోద, సాలమ్మ, నాగరత్న, చెంగమ్మ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మణి

రైల్వేకోడూరు, జూలై 27: రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి మొగిలి వినయ్ అధ్యక్షతన సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు వాటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. నిత్యావసరాల ధరలు, విద్యుత్ ఛార్జీలు మండిపోతున్నాయన్నారు. ధరల పెరుగుదల విషయంలో వైసీపీ, కూటమికి తేడా లేదన్నారు. ఇసుక విషయంలో ఇంత వరకు ప్రభుత్వానికి ఒక్క కొలిక్కి తేలేదన్నారు. కార్మికులకు పనులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. రైల్వేకోడూరులో ఒక ట్రాక్టర్ ఇసుక రూ. 8000లకు విక్రయిస్తున్నారన్నారు. కార్మికులకు పనులు దొరక్కపోవడంతో పస్తులు ఉంటున్నారన్నారు. ధరలు తగ్గించే వరకు ప్రతి ఒక్కరు ఆందోళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశం లో సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, నాయకులు సోని, చాముండేశ్వరి, రంగమ్మ, పెంచలమ్మ, నరసమ్మ, సుబ్బలక్షుమ్మ, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

బెరైటీస్ విక్రయాలు ప్రారంభించాలి

రైల్వేకోడూరు, జూలై 27: ఏపీఎండీసీ బెరైటీస్ అమ్మకాలను ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం రైల్వేకోడూరు సీఐటీయూ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎండీసీలో గత ప్రభుత్వం అవినీతికి పాల్పడిందంటూ, ప్రస్తుత ప్రభుత్వం ముగ్గురాయి అమ్మకాలను నిలిపివేసిందన్నారు. సంస్థ పైన ప్రత్యక్షం గాను, పరోక్షంగాను ఆధారపడి జీవిస్తున్న సుమారు 20 వేల కార్మిక కుటుంబాలు ఉపాధి లేక తినడానికి తిండి లేక ఆకలికేకలతో అలమటిస్తున్నాయన్నారు. అవినీతి పైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి గాని, పనులు ఆపేస్తే కార్మికులు ఎలా జీవించాలని ఆందోళన వ్యక్తం చేశారు. బెరైటీస్ ఆగిపోతే సంస్థకు లాభాలు రాకుండా పోతాయని, కార్మికులు నష్టపోతారని అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని అధికారులు ప్రభుత్వానికి ఎందుకు చెప్పలేకున్నారని ప్రశ్నించారు. ముగ్గురాయి అమ్మకాలను తిరిగి ప్రారంభించాలని లేకపోతే కార్మికుల కుటుంబాలను కలుపుకుని ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలి

రాయచోటిటౌన్, జూలై27: టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యవర్గ సభ్యుడు బుక్కే విశ్వనాథనాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మూడే శంకర్‌నాయక్, గిరిజన సమాఖ్య నాయకులు రామాంజులు, దేవరాజ్‌లు డిమాండ్ చేశారు. శనివారం వారు రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామానికి సమీపంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు ఎదురుగా అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా వైసీపీ సర్కార్ నిలుపునా ముంచేసిందన్నారు. . ఇప్పటికైనా నూతన ప్రభుత్వం చొరవ తీసుకొని టిడ్కో ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సుమారు 70 శాతం పనులు పూర్తయినా, వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో లబ్ధిదారులు పూర్తిగా నష్టపోయారని, ఇప్పటికైనా తెలుగుదేశం ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని కోరారు. .

నిర్మాణ రంగంపై విద్యార్థులకు అవగాహన

రాజంపేట, జూలై 27 : నిర్మాణ రంగంలో జీజీబీఎస్ ప్రాముఖ్యతపై అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలోని విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీజేఎస్‌డబ్ల్యూ, సిమెంట్స్ సేల్స్ మేనేజర్ కె.రాఘవ హరినారాయణ మాట్లాడుతూ కాంక్రీట్ ఉత్పత్తిలో జీజీబీఎస్ వినియోగం కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించడంతోపాటు, పారిశ్రామిక వ్యర్థాలు రీసైకిల్ అవుతాయన్నారు. జీజీబీఎస్‌ను వినియోగంతో సస్టైనబులిటీ, కట్టడాల్లో స్ట్రెంత్‌ను పెంపొందించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.నరేష్‌కుమార్, జేఎస్‌డబ్ల్యూ సేల్స్ మేనేజర్లు ఆసిఫ్ , రాజ్‌కుమార్, అధ్యాపకులు బి.రఘునాథ్‌రెడ్డి, ఎస్. వెంకటవరప్రసాద్, ఎ.అనిల్‌కుమార్, ఎస్. అష్రఫ్ అలీ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు విజయశేఖర్‌రెడ్డి

రాజంపేట, జూలై 27 : ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతానని వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి మాటాడటం హాస్యాస్పదమని టీడీపీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం తన పార్టీ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో చేసిన అక్రమాలు, అన్యాయాలు అన్నీ ఇన్నీ కావని ఆయన ధ్వజమెత్తారు. పెద్దిరెడ్డి రాష్ట్రంలోని క్వారీలను తన గుప్పెట్లో పెట్టుకుని వేల కోట్ల అక్రమార్జన చేశారన్నారు. పోలవరం ప్రాజెక్టుకూడా తనవారికి దక్కేలా చేసుకుని అక్రమ సంపాదనే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం కొనసాగిందన్నారు. ఇవన్నీ గమనించిన ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా చేశారన్నారు. రాష్ట్ర ప్రజలు విజ్ఞులని, మీరు చెప్పే అబద్ధపు మాటలు నమ్మరని జగన్‌రెడ్డి గుర్తించుకోవాలని హితవు పలికారు.

వైసీపీలో కలకలం

బెంగళూరు విమానాశ్రయంలో మోహిత్‌రెడ్డి అరెస్టు

- పనిచేయని చెవిరెడ్డి మంత్రాంగం... పలుకుబడి
- నేడు తిరుపతిలో కోర్టుకు హాజరుపరిచే అవకాశం

తిరుపతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ విమాన మెక్కేందుకు ప్రయత్నిస్తూ తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం రాత్రి బెంగళూరు విమానాశ్రయంలో అరెస్టు కావడం చంద్రగిరి నియోజకవర్గ వైసీపీలో కలకలం రేపింది. అతనితో పాటు దుబాయ్ వెళ్ళేందుకు బయల్దేరిన తండ్రి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, తమ్ముడు హర్షిత్ రెడ్డి ఈ ఘటనతో ప్రయాణం విరమించుకున్నారు. మోహిత్‌ను ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్న సమయంలో వారితో వాదనకు దిగిన చెవిరెడ్డిని కూడా విమానాశ్రయ అధికారులు నిర్బంధించారు. తండ్రీ కొడుకులు ముగ్గురూ దేశం విడిచి పారిపోయేందుకు ప్రయత్నించారన్న ప్రచారం


బెంగళూరు విమానాశ్రయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

మొదలైంది. ఈ ఘటనల నేపథ్యంలో చంద్రగిరి వైసీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో చంద్రగిరి నుంచీ టీడీపీ అభ్యర్థిగా పులివర్తి నాని, వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పోటీ పడిన సంగతి తెలిసిందే. పోలింగ్ రోజు రెండు మూడు గ్రామాల్లో జరిగిన ఘర్షణల నేపథ్యంలో పోలింగ్ మరునాడు కౌంటింగు కేంద్రమైన తిరుపతి మహిళా వర్శిటీ ఎదుట టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం జరిగింది. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి అనుచరులు జరిపిన ఈ భయానక దాడిలో నానీ తృటిలో తప్పించుకున్నారు. ఈ ఘటన చంద్రగిరి నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైంది. ప్రతీకార దాడుల్లో పలువురు గాయపడగా, కొన్ని వాహనాలు సైతం ధ్వంసమయ్యాయి. నానీ గన్‌మెన్ జరిపిన కాల్పుల్లో కూడా ఇద్దరు గాయపడ్డారు. పోలింగ్ మరుసటి రోజు ఈవీఎంలు భద్రపరిచిన మహిళా వర్శిటీ ప్రాంగణంలోనే ప్రధాన రాజకీయ పార్టీ అయిన టీడీపీ అభ్యర్థిపై హత్యాయత్నం జరగడాన్ని ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. దీనిపై విచారణకు ప్రత్యేకంగా సిట్ ఏర్పాటు చేసింది. ఈ కేసులో ఇప్పటికే 37మంది అరెస్టు అయి రిమాండులో వున్నారు. వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రోద్బలంతోనే హత్యాయత్నం జరిగిందంటూ కేసులో అతన్ని కూడా నిందితుడిగా చేర్చారు. తనను అరెస్టు చేస్తారనే ఉద్దేశంతో మోహిత్ హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు మరికొంత గడువు కావాలని ప్రాసిక్యూషన్ కోరడంతో వాయిదా వేస్తూ వచ్చింది. తదుపరి విచారణ ఈనెల 29న సోమవారం జరగాల్సి వుంది. అయితే ఈలోపు మోహిత్‌రెడ్డి బెంగళూరు నుంచీ దుబాయ్ వెళ్ళే ప్రయత్నంలో విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులకు పట్టుబడ్డారు. వారు అదుపులోకి తీసుకుని తిరుపతి పోలీసులకు సమాచారమిచ్చారు.అరెస్టు చేసేందుకు తిరుపతి పోలీసులు హుటాహుటిన బెంగళూరు బయల్దేరి వెళ్ళారు. ఆదివారం వేకువజామున మోహిత్‌ను తిరుపతి తీసుకొచ్చి అరెస్టు చూపించే అవకాశముంది.దీంతో హైకోర్టులో మోహిత్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ఇపుడు నిరర్థకమైనట్టుగా భావించాల్సివుంది. హైకోర్టులో కొత్తగా బెయిల్ పిటిషన్ మళ్ళీ వేయాల్సి వుంటుంది.



తండ్రీ కొడుకులు పారిపోయే ప్రయత్నం చేశారంటూ ప్రచారం

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఆయన కుమారులు మోహిత్, హర్షిత్ దుబాయ్ వెళ్ళే క్రమంలో మోహిత్ పట్టుబడడంతో ఈ ముగ్గురూ దుబాయ్ పారిపోయే ప్రయత్నం చేశారన్న ప్రచారం మొదలైంది. వాస్తవానికి పులివర్తి నానీ తనపై జరిగిన హత్యాయత్నం కేసులో చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఆయన తనయులు , తమ్ముడు రఘునాథ రెడ్డి తదితరుల పాత్ర వుందని, వారిని నిందితులుగా కేసులో చేర్చాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతానికి మోహిత్‌రెడ్డిని నిందితుడిగా కేసులో చేర్చిన పోలీసులు తర్వాతి దశలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన సోదరుడు రఘునాథరెడ్డి, కుమారుడు హర్షిత్‌రెడ్డి పేర్లు కూడా కేసులో చేర్చే అవకాశాలు లేకపోలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో కక్ష సాధింపు చర్యలు, వేధింపులు వుంటాయని, ఈ కేసులో అరెస్టు కూడా చేయచ్చనే అంచనాతో తండ్రీ కొడుకులు ముగ్గురూ దుబాయ్ వెళ్ళిపోయే ప్రయత్నం చేశారనే ప్రచారం జరుగుతోంది.ఇది నిజమైనా కాకపోయినా ఈ తరహా ప్రచారం జరుగుతుండడంతో చంద్రగిరి వైసీపీ శ్రేణులు ఆందోళనలో పడ్డాయి.స్నేహితుడి పెళ్ళి వుంటే మోహిత్ ఒక్కరే బయల్దేరి ఆ క్రమంలో అరెస్టయినా సమాధానం చెప్పుకునే పరిస్థితి వుండేదని, అలా కాకుండా తండ్రీ కొడుకులు ముగ్గురూ దుబాయ్ బయల్దేరడం ఈ ప్రచారానికి ఊతమిస్తోందని సొంత పార్టీ వర్గాలు వాపోతున్నాయి. అన్ని స్థాయుల్లో పలుకుబడి, మంత్రాంగం చేయగలిగిన శక్తిసామర్థ్యాలున్న చెవిరెడ్డి తనయుడి అరెస్టును అడ్డుకోలేకపోవడం కూడా శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసినట్టవుతోంది. ఉన్నత న్యాయస్థానాల నుంచీ రక్షణ పొందలేకపోవడం కూడా కార్యకర్తల స్థైర్యం సడలేందుకు కారణమవుతోంది. చెవిరెడ్డి, ఆయన కుటుంబం స్థాయిలోనే ఇలా వుంటే తమ పరిస్థితి ఏమిటన్న ఆలోచన వారిలో ఆందోళన రేకెత్తిస్తోంది. కాగా విదేశాల్లో చదివిన తన కొడుకును వీధి పోరాటాలకు సిద్ధం చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి శనివారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తన కొడుకు వయసు 25 ఏళ్ళని, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి ప్రజా జీవితంలోకి వచ్చాడని పేర్కొన్నారు. అలాంటి వాడిని అక్రమ కేసులో అరెస్టు చేయించారని, వీధి పోరాటాలకు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనికి చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు.ప్రజల పక్షాన ఏ స్థాయి పోరాటానికైనా తాము సిద్ధంగా వున్నామని ప్రకటించారు.

కార్మికులకు పథకాలు వర్తించేలా చర్యలు

● కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూలై 27: పరిసరాల శుభ్రతకు కృషి చేస్తున్న కార్మికులకు ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, పీఎం జీవనజ్యోతి పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సఫాయి కర్మచారి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు మూడు నెలలకొకసారి అపోలో, సీఎంసీ వైద్యులతో వైద్య పరీక్షలు చేయించాలన్నారు. యూనిఫాం, గ్లౌజులు, షూలు అందించాలని ఆదేశించారు. కార్మికులు మరణిస్తే వారి పిల్లలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సఫాయి కర్మచారి సభ్యులు చిన్నస్వామి, వరలక్ష్మి మాట్లాడుతూ కార్మికుల పిల్లలకు ప్రైవేటు, ఎయిడెడ్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో 25 శాతం ఫీజు రాయితీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, డ్వామా పీడీ రాజశేఖర్, ఏఎస్పీ అరీఫుల్లా పాల్గొన్నారు.

30న జాబ్‌మేళా

చిత్తూరు, జూలై 27: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ ఫైనాన్షియల్ లిమిటెడ్, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, సంగీత మొబైల్స్, మాక్స్‌లైఫ్ ఇన్సూరెన్స్‌లోని పలు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ చేసి 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సులోపు వారు బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన వారికి రూ.14 వేల నుంచి రూ.18వేల వరకు జీతభత్యాలు ఉంటాయని తెలిపారు. ఇతర వివరాలకు 8121015257ను సంప్రదించాలని కోరారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), జూలై 27: కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి డి.రామచంద్రరావు శనివారం కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో వారిని ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.


న్యాయమూర్తికి జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

వాహనాల ఢీ

ఐదుగురికి గాయాలు ● మూడు టన్నుల టమోటాలు నేలపాలు


నేలపాలైన టమోటాలు - ప్రమాదానికి కారణమైన కంటైనర్

బంగారుపాళ్యం, జూలై 27: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్‌లో శనివారం సాయంత్రం నాలుగు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మూడు టన్నుల టమోటాలు నేలపాలయ్యాయి. పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కంటైనర్ ముందు వెళుతున్న ఖాళీ పెట్రోల్ ట్యాంకర్‌ను ఢీకొంది. ట్యాంకర్ అడ్డం తిరిగి డివైడర్‌కు అవతలవైపు వెళుతున్న కారును ఢీకొంది. కంటైనర్ అదుపు తప్పి చితూరు వైపు వెళుతున్న టమోటా ట్రాక్టర్‌ను ఢీకొంది. ట్రాక్టర్ ట్రాలీ ఊడిపోయి మూడు టన్నుల టమోటా నేలపాలైంది. అదే దారిలో వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. కారులో వెళుతున్న ఇద్దరికి, ద్విచక్ర వాహనంలో వెళుతున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

సాక్షి పత్రికకు ఇచ్చిన ఎల్‌ఏ ప్రకటనల వివరాలు పంపండి

చిత్తూరు కలెక్టరేట్, జూలై 27: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాక్షి దిన పత్రికకు జగపతి పబ్లికేషన్స్ పేరిట ఇచ్చిన భూసేకరణ ప్రకటనల వివరాలు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు అందాయి. 2019-20 నుంచి 2023-24 వరకు జిల్లాల్లో రెవిన్యూ డివిజన్ల వారీగా భూసేకరణ పేరిట సాక్షి దినపత్రికకు ఇచ్చిన ప్రకటనల వివరాలు పంపాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు కలెక్టర్ పేరిట చిత్తూరు, కుప్పం, నగరి, పలమనేరు ఆర్డీవోలకు ఉత్తర్వులు వెళ్లాయి.

ఆ ఆస్తులతో పెద్దిరెడ్డికి సంబంధం లేదని నిరూపిస్తే

రాజకీయాల నుంచి తప్పుకుంటా..

బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్

పుంగనూరు, జూలై 27: ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరచని 142 ఆస్తులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి సంబంధం లేని నిరూపిస్తే తన పార్టీ రద్దు చేసి, హైకోర్టులో కేసు విత్‌డ్రా చేసి, రాజకీయాల నుంచి తప్పుకుంటానని బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ సవాల్ విసిరారు. శనివారం ఆయన పుంగనూరులో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల అఫిడవిట్‌లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అతని భార్య స్వర్ణలత ఆస్తుల వివరాలు సక్రమంగా పొందపరచలేదని ఆధారాలతో తాను హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశానన్నారు. ఈ నెల 24న దానిపై విచారణ జరిగి 31 నాటికి రికార్డులు తీసుకురావాలని ఆర్వోను హైకోర్టు ఆదేశించినట్లు తెలిపారు. అక్రమాలు బయట పడతాయని పెద్దిరెడ్డి మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు దగ్ధం చేయించి ఉంటారనే అనుమానాలున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూములు, ఇసుక, ఎర్ర చందనం, గనులు, కాంట్రాక్టు పనుల్లో వందల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. అలాంటి వ్యక్తిని మాజీ సీఎం జగన్ ఉత్తముడిగా పేర్కొనడం బాధాకరమన్నారు. జగన్ కోర్టుకెళ్లి ప్రతిపక్ష హోదా కావాలని కోరడం సిగ్గు చేటన్నారు. పెద్దిరెడ్డి కుటుంబ ఆస్తులు, వారు చేసిన పనులపై కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పెద్దిరెడ్డిపై అనర్హత వేటు పడి, ఆయన శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకునే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సమావేశంలో బీసీవైపీ నాయకులు సీ సాంబమూర్తి, ఆర్.హరినాథరెడ్డి, ఆనంద్‌రెడ్డి, వెంకటేశ్, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

ఆనందగిరిలో బ్రహ్మోత్సవ సందడి



సుబ్రమణ్య స్వామి పూజలో ఎమ్మెల్యే పులివర్తి నాని, మూషిక వాహనంపై వినాయకుడు

పాకాల, జూలై 27: పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరిపై వెలసిన వల్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు శనివారం అక్కగార్ల పూజతో ప్రారంభమయ్యాయి. ఉభయదారులు ఏటుకూరి లలిత కుటుంబీకులు అక్కగార్ల పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉభయదారులు బొల్లినేని అశోక్, వి. సరితా రామచంద్ర నాయుడు కుటుంబసభ్యులు గణపతి పూజ, కంకణధారణ, పుణ్యాహవచనం, అంకురార్పణ, కలశస్థాపన హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉభయదారులు వి.రాంబాబు నాయుడు, కోరా ప్రకాష్ నాయుడు, ఆర్.నారాయణస్వామి, మదురాచ్చారి, శ్రీనివాసపిళ్లై, సంద్ర మురళీధర్ నాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మూషిక వాహనంపై వినాయకస్వామి ఊరేగింపు నిర్వహించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆడికృత్తిక ప్రారంభోత్సవ పూజల్లో, వాహనసేవలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యులు, అధికారులు పూర్ణ కుంభంతో మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల పేరుమీద ఎమ్మెల్యే నాని అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ కమిటీ, ఉభయదారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. 31వ తేది మంగళవారం ఆడికృత్తికను పురస్కరించుకొని విశేష సంఖ్యలో స్వామి వారి దర్శనానికి భక్తులు తరలి రానున్న దృష్ట్యా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పాకాలనుంచి ఊట్లవారిపల్లె ఆనందగిరి ఆలయం వరకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ ఎస్.చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మ్యాంగోనగర్‌లో అగ్నిప్రమాదం

11 మామిడి మండీల దగ్ధం - భారీగా ఆస్తి నష్టం


దామలచెరువు మ్యాంగోనగర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న మామిడి మండీలు

పాకాల, జూలై 27: మండలంలోని మ్యాంగోనగర్‌లో శనివారం మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదంలో 11 మామిడి మండీలు దగ్ధమయ్యాయి. ఓ నివాస గృహం కాలిపోయింది. మధ్యాహ్నం ఓ మండీలో వ్యాపించిన మంటలు గాలి ఎక్కువగా రావడంతో వెంట వెంటనే సమీప మండీలకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో అహ్మద్ బాషా, హకీం, గిరిధర్‌రెడ్డి, భాస్కరయ్య, మల్లికార్జున, జీఎస్.మస్తాన్, హజ్మల్ బాషా, ఫజరుల్లా, యాసానుల్లా, ఫరీద్ బాషా, అంజాద్ బాషాలకు సంబంధించిన మండీలు కాలిపోయాయి. మండీలలో ఉంచిన వస్తువులు. మోటరు సైకిళ్ల, పీవీసీ పైపులు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.25 నుండి 30 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని భావిస్తున్నారు. అగ్నిప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ డీడీఆర్ఎఫ్ రమణయ్య ఆధ్వర్యంలో చిత్తూరు, పీలేరు, తిరుపతి, పాకాల నుంచి అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. లేకుంటే మరింత భారీ నష్టం వాటిల్లేది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని మ్యాంగోనగర్‌కు వెళ్లి అగ్నిప్రమాద బాధితులను పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను విచారించాలని పోలీసులను ఆదేశించారు. అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు.

ఎంబీయూలో బెలూన్ శాటిలైట్ ప్రయోగం




చంద్రగిరి, జూలై 26: తిరుపతి సమీపంలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో బెలూన్ శాటిలైట్ ప్రయోగం విజయవంతమైనట్లు ఛాన్సలర్ మోహన్‌బాబు ప్రకటించారు.జాతీయ వాతావరణ పరిశోధనా ప్రయోగశాల(ఎన్ఏఆర్ఎల్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్టీ) సహకారంతో ఎంబీయూ విద్యార్థులు తయారు చేసిన ఈ బెలూన్ శాటిలైట్‌ను శనివారం ఉదయం ఎంబీయూలోని పాఠశాల క్రీడామైదానంలో సినీ నటుడు, ఎంబీయూ ఛాన్సలర్ మోహన్‌బాబు చేతులమీదుగా నింగిలోకి వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కిలోల బరువుగల శాటిలైట్ 35 కిలో మీటర్ల ఎత్తులో 200 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు.కార్బన్ డయాక్సైడ్ స్థాయి, ఓజోన్ సాంద్రతలు, ఉష్ణోగ్రత, తేమ, వాతావరణ పీడనం వంటి క్లిష్టమైన పర్యావరణ పరిమితులను ఈ శాటిలైట్ పర్యవేక్షిస్తుందన్నారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఇస్రో శాస్త్రవేత్తలైన, చంద్రయాన్ మిషన్ 3 డైరెక్టర్ డాక్టర్ వీరముత్తువేల్, అసోసియేట్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కల్పన, ఓషన్ శాట్ 3 మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ తెన్మొయి శెల్వి, షార్ ఇస్రో గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ గోపీకృష్ణ మాట్లాడుతూ ఎంబీయూ విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం శాస్త్రవేత్తలను మోహన్‌బాబు, ప్రొ ఛాన్సలర్ మంచు విష్ణు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏఆర్ఎల్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటరత్నం, ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ నాగరాజరామా రావు, చీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, ఆర్ అండ్ డీ డీన్ ఈశ్వర్ తదితరులు పాల్గొనున్నారు.

ఉదయం చెప్పాడు... సాయంత్రం నెరవేర్చాడు

ఎమ్మెల్యే గురజాల స్పందనపై హర్షం

గుడిపాల, జూలై 27: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఉదయం హామీ ఇచ్చి, సాయంత్రానికి నెరవేర్చి శభాష్ అనిపించుకున్నారు. నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేసేందుకు శనివారం ఉదయం ఎమ్మెల్యే వెళ్లారు. తాగునీటికి ఇబ్బందిగా ఉందని హెచ్ఎం ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సాయంత్రంలోపు బోరు వేయిస్తానని మాటిచ్చి ఆ మేరకు సమస్యను పరిష్కరించారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలకు పూర్తిస్థాయిలో ఫ్లోరింగ్ వేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


బోరులో పొంగుతున్న నీరు

రేపు జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక


రామకుప్పంలో మీడియా సమావేశం

రామకుప్పం, జులై 27: ఈ నెల 29వ తేదీ సోమ వారం ఉదయం 9గంటలకు రామకుప్పం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరగనున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు. క్రీడాకారులు 2008 ఏప్రిల్ తరువాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ మహేష్, ప్రెసిడెంట్ పవన్‌కుమార్, సెల్వం, లోకనాథం, జబీర్, స్వాతి, జమున, సబిత తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 6301831236 సంప్రదించాలని కోరారు.

నిందితులను తక్షణం అరెస్టు చేయాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య

మదనపల్లె అర్బన్, జూలై 27: స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ప్రభుత్వ రికార్డులు దహనం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. శనివారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులతో కలిసి ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ అధికారులు భూకబ్జాదారులు కలిసి రాజకీయ నాయకుల అండతో వెయ్యి ఎకరాలపైగా అక్రమణ చేసి వాటికి ఫేక్ రికార్డులు సృష్టించారన్నారు. 22ఏ రికార్డులను గోల్‌మాల్ చేశారని ఈ నేపథ్యంలోనే వారు ప్రభుత్వ రికార్డులు పూర్తిగా దహనం చేశారని ఆరోపించారు. ఈ సంఘటనకు వెనుకు ఏ రాజకీయ పార్టీ నాయకులు ఉన్నా పార్టీలకు అతీతంగా దర్యాప్తు నిర్వహించి దోషులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ సర్దుబాటు చర్యల్లో భాగంగా రెడ్ బుక్‌లో పేజీలు చింపవద్దని ప్రభుత్వాన్ని కోరారు. మదనపల్లె, పుంగనూరు. తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో వేల ఎకరాలు అక్రమణలకు పాల్పడారన్నారు. గతంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాపై సమగ్రవిచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప, సాంబశివ, మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి, మాధవ్‌రెడ్డి, తిరుమల, కమలాకర్, శ్రీనాథ్, రాహుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అల్లుడి చేతిలో అత్త హతం



నీలావతి (ఫైల్ ఫొటో)

పీలేరు, జూలై 27: తన భార్యను కాపురానికి పంపలేతన్న అక్క సుతో అత్తను అల్లుడు కడతేర్చిన సంఘటన శనివారం కేవీపల్లె మండలంలో జరిగింది. కేవీపల్లె పోలీసుల కథనం మేరకు కేవీ పల్లె మండలం వగళ్ల పంచాయతీ నారమాకులపల్లె గ్రామానికి చెందిన ఆరేటి నీలావతి కుమార్తె రెడ్డి సుధాను చిత్తూరుకు చెందిన విజయ్ కుమార్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. గత కొన్నేళ్లగా వారిద్దరి మధ్య మనస్పర్థలు పొడసూపాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో రెడ్డిసుధా చిత్తూరు నుంచి తన పుట్టింటికి వచ్చేసింది. ఈ నేపథ్యంలో భార్యను తనతోపాటు తీసుకెళ్లేందుకు విజయ్‌కుమార్ శుక్రవారం రాత్రి అత్తారింటికి వచ్చాడు. శుక్రవారం రాత్రి గొడవపడిన అత్తాఅల్లుళ్లు, శనివారం ఉదయం కూడా మరోమారు గొడవపడ్డారు. శనివారం ఉదయం జరిగిన గొడవలో ఆమె తలపై కర్రతో కొట్టడంతో ఆమె ఇంటిలోనే మర ణించింది. పోలీసులకు సమాచారం అందడంతో వారు విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని నీలావతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డుప్రమాదంలో గాయపడ్డ తండ్రీకొడుకులు

● ఒకరి పరిస్థితి విషమం..తిరుపతికి తరలింపు

బి.కొత్తకోట, జూలై27: బి.కొత్తకోట మండల పరిధిలోని కాండ్లమడుగు క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో తండ్రీకొడుకులు గాయపడ్డారు. గోళ్లపల్లె హైస్కూల్‌లో పనిచేసే నాగరాజు(62)ను స్కూల్‌లో దింపేందుకు పెద్దమండ్యం నుంచి తన కొడుకు పృథ్వీరాజ్(35) ద్విచక్రవాహనంలో వస్తుండగా ఓ కారు ఢీకొట్టింది. ఘటనతో వారిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108సిబ్బంది రాజు, ఉమశ్రీ లు బాధితులను మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి పరీక్షించిన వైద్యులు నాగరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

ఐటీఐతో ఉపాధి అవకాశాలు మెండు

తంబళ్లపల్లె, జూలై 27: ఐటీఐ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐ వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో రెండో విడతలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఐటీఐలో రెండేళ్ల వ్యవధి గల ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్ కోర్సులకు 63 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 60 మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు తెలిపారు. వారి విద్యార్హత ధృవపత్రాలు పరిశీలించి రిజర్వేషన్, మెరిట్ ప్రకారం ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో 24 మందికి, ఫిట్టర్‌లో 24 మందికి, సివిల్‌లో 12 మందికి అడ్మిషన్లు కల్పించినట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లకు త్వరలో మూడో విడతలో ప్రవేశాలుంటాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్లు వెంకటరమణ, సురేంద్ర, అశోక్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫైళ్లు వితరణ



కురబలకోట, జూలై 27: మండలంలోని ముదివేడు క్రాస్ కేజీబీవీ పాఠశాలకు చెందిన 35 మంది విద్యార్థులకు ఫైళ్లు వితరణ చేశారు. శనివారం రిడో సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్ చదువు తున్న విద్యార్థులకు ఫైళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ద్వారకనాథ్, ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, హెచ్‌ఎం ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వేగంగా సేవలందించాలి

● ఉద్యోగులకు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సూచనలు



మదనపల్లె సబ్‌కలెక్టరేట్ ఉద్యోగులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, జూలై 27: మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని ప్రజలకు వేగంగా సేవలందించాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఉద్యోగులకు సూచించారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ బంగ్లాలో సబ్‌కలెక్టరేట్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఫైళ్ల దహనంపై ఉన్నతాధికారుల విచారణ చట్టప్రకారం జరుగుతుందని, దీనిపై ఉద్యోగులు ఆందోళన విడనాడాలన్నారు. సాధారణ స్థితికి చేరుకుని సబ్‌కలెక్టరేట్‌కు ప్రజల నుంచి వచ్చే పిటీషన్లను పరిష్కరించడంలో పాలుపంచుకోవాలన్నారు. 25 రెవెన్యూ విభాగాల రన్నింగ్ ఫైళ్లను తిరిగి రికవరీ చేస్తామని, వాటి ఆధారంగా ముందు పరిస్థితి, అప్పటి వాతావరణం తీసుకొస్తామన్నారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాకే ఫైళ్లను తనకు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో డీఏవో శ్రీనివాసులు, శేషయ్య, గురుమూర్తి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

● ప్రభుత్వాసుపత్రిలో నూతన బోరు డ్రిల్లింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆసుపత్రిలో నూతన బోరు డ్రిల్లింగ్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి, టీడీపీ నాయకులు

తంబళ్లపల్లె, జూలై 27: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో నూతన బోరు వేసి నీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఉన్న బోరులో నీరు తగ్గిపోయి గత నాలుగు నెలలుగా నీటి సమస్య తలెత్తగా వైద్య సేవల కోసం వచ్చే రోగులు, ఇన్‌పేషంట్లతో పాటు ఆసుపత్రి సిబ్బంది ఇబ్బంది పడు తున్నారు. నీటి సమస్యను వైద్యాధికారి వెంకట్రామయ్య డీఈ, ఏఈ ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లగా వారు స్పందించలేదు. దీంతో ఆయనే సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటిని తోలిస్తున్నా అవి సరిపోవడం లేదు. ఈ నీటి సమస్యపై శనివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'ప్రభుత్వాసుపత్రిలో నీటి కష్టాలు' అనే శీర్షికన కథనం వెలువడింది. ఈ కథనంపై కూటమి ప్రభుత్వం శరవేగంగా స్పందించి వెంటనే ఆసుపత్రిలో నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. దీంతో శనివారం ఉదయం 10 గంటలకే బోరు బండి ఆసుపత్రికి వచ్చి నూతన బోరు డ్రిల్లిం గ్ వేయగా నీరు పుష్కలంగా పడింది. ఆసుపత్రిలో నీటి సమస్య పరిష్కారం అవుతుండటంతో వైద్యాధికారి వెంకట్రామయ్య, ఆసుపత్రి సిబ్బంది, కూటమి నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

పదవీ విరమణ చేసిన ఎంపీడీవోకు సన్మానం



రిటైర్డ్ ఎంపీడీవోను సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

రామసముద్రం, జూలై 27: రామసముద్రంలో ఎంపీడీవోగా పని చేస్తూ పదవీ విరణ చేసిన నారాయణస్వామిని శనివారం సచివాలయ సిబ్బంది శాలువతో సన్మానించారు. నారాయణస్వామి గత ఏడాది జూన్ 13న రామసముద్రం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించి ఈ ఏడాది మే 31న పదవీ విరమణ చేశారు. ఈసన్మాన కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎంఈవో హేమలత, ప్రస్తుత ఇన్‌చార్జి ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్, పలువురు సెక్రటరీలు పదవీ విరమణ చేసిన ఎంపీడీవో నారాయణస్వామి సేవలను కొనియాడారు.

ఎల్‌సీడీసీ సర్వే తనిఖీ

వాల్మీకిపురం, జూలై 27: వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఎల్‌సీడీసీ ఇంటింటి సర్వేను డిప్యూటీ డీపీఎంవో వేణుగోపాల్‌రావ్, డాక్టర్ శ్రీవిద్యలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే సమయాన స్పర్శ లేని మచ్చలు గుర్తించి కేసులను తక్షణమే వైద్యాధికారుల కు తెలియజేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో ప్రజల అవగాహన నిమిత్తం ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్ర మంలో సీహెచ్‌వో ఇందిరారాణి, సూపర్‌వైజర్ సుధాకంర్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అవసరం మేరకే మందులు వాడాలి

మదనపల్లె టౌన్, జూలై 27: టమోటా సాగులో రైతులు అవసరం మేరకే పురుగు మందులు వినియోగించాలని కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ కె.మంజుల పేర్కొన్నారు. శనివారం మండంలోని కాశీరావుపేట గ్రామం వద్ద రైతు రామయ్య పొలంలో టమోటా పంట క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు మాట్లాడుతూ టమోటాకు వచ్చే తెగుళ్లను గుర్తించి సరైన మందులను సమగ్ర విధానాలతో వినియోగించాలన్నారు. న్యూఢిల్లీ ఐసీఏఆర్ శాస్త్రవేత్త రాఘవేంద్ర మాట్లాడుతూ సస్యరక్షణ విధానంతో టమోటా పంట చుట్టూ మొక్కజొన్న, సజ్జ పంటలను వేయాలని రైతులకు వివరించారు. ఉద్యానశాఖాధికారి ఈశ్వరప్రసాద్‌రెడ్డి, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

1న పెన్షన్‌ను ఇంటి వద్దనే అందిస్తాం

పెద్దతిప్పసముద్రం జూలై 27 : పెన్షన్ దారులకు ప్రతి నెల అందించే పెన్షన్‌ను 1వ తేదీన ఇంటి వద్దనే అందిస్తామని మండల అభివృద్ధి అధికారి బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని అన్ని గ్రామాల్లోని పెన్షన్ దారులకు సచివాలయ ఉద్యోగులచే ఇంటి వద్దనే పెన్షన్‌లను అందిస్తామన్నారు.

సీఎంను కలిసిన చీకలబైలు సర్పంచ్

మదనపల్లె అర్బన్, జూలై 27: ఏపీ రాజధాని అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును శనివారం మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలిసి చీకలబైలు సర్పంచ్ ఎం.ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. గత వైసీపీ పాలనలో అంగళ్లు ఘటనతో పాటు అనేకంగా చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్‌పై అక్రమ కేసులు పెట్టారని, వాటి గురించి వివరించి న్యాయం చేయాలని కోరారు.

ఫైళ్ల దహనంతో అధికారులు అప్రమత్తం

●ఎంపీడీవో కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

ములకలచెరువు, జూలై 27: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఫైళ్ల దహనం ఘటనలో ములకలచెరవు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు, పత్రాలు భద్రపరిచిన పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో పోలప్ప చొరవతో కార్యాలయం ప్రధాన ద్వారం, ఎంపీడీవో, రికార్డుల గది తదితర చోట్ల సీసీ కెమెరాలు అమర్చారు. దీంతో మండల ప్రజాపరిషత్ కార్యాలయం సీసీ కెమెరాల నిఘాలోకి వెళ్లింది. ఈ సందర్భంగా ఎంపీడీవో పోలప్ప మాట్లాడుతూ ముందస్తు భద్రతలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించామన్నారు. రికార్డుల భద్రత కోసం రాత్రి వేళల్లో సిబ్బందిని కాపలా ఉంచుతున్నామన్నారు.

అనాథ పిల్లలకు అన్నదానం

మదనపల్లె అర్బన్, జూలై 27: కోళ్లబైలు పంచాయతీ, అమ్మచెరువుమిట్టలోని వెలుగు ప్రత్యేక పాఠశాల పిల్లలకు శనివారం మదనపల్లె వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సౌజన్యల కుమారుడు సాయి మనోహిత్ జన్మదినోత్సవం పురస్కరించుకుని అన్నదానం చేశారు. ఈసందర్భంగా అనాథల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సోషల్ వర్కర్ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలు ప్రయోజనకరంగా ఉండాలి

మదనపల్లె అర్బన్, జూలై 27: ప్రభుత్వాలు ఏవైనా చట్టాలు తీసుకువస్తే అవి ప్రజలకు ప్రయోజనకరంగా ఉండాలే తప్ప ప్రమాదకరంగా ఉండకూడదని అఖిల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కోశాధికారి, న్యాయవాది ఎస్ రమేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో ఈ చట్టాలపై అవగాహన సదస్సును ఐలు మదనపల్లె కమిటీ ఉపాధ్యక్షుడు పీవీప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ దేశంలో వలస పాలకులు తీసుకొచ్చిన చట్టాలు కొనసాగరాదని వాటి స్థానంలో కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కొత్త నేర చట్టాల్లో గొప్పగా మార్పులు చేసిన దాఖలాలు ఏమి లేవన్నారు. పాత చట్టాల పేర్లు మార్చారని, ఇందులో 10 శాతం మాత్రమే చట్టాల్లో మార్పులు చేశారని తెలిపారు. కొత్త చట్టాల అమలుతో న్యాయవాదులు పలు సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి. శ్రీనివాసులు, సీఐటీయూసీ జిల్లా కోశాధికారి హరి శర్మ, మదనపల్లె బార్ అసోసియేషన్ కార్యదర్శి బయ్యారెడ్డి, ఐలు జిల్లా నాయకుడు సోమశేఖర్, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, నాయకులు షాజహాన్, శ్రీనివాసులు, మనోహర్, రమాదేవి, సుజాత, సీఐటీయూ నాయకులు గంగాదేవి, రాణి, నారాయణ, ఆంజనేయులు, రెడ్డెప్ప, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ రాష్ట్రపతి కలామ్ వర్ధంతి



అబ్దుల్ కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 27: పట్టణంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో టీడీపీ నాయకు లు అబ్దుల్ కలామ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయ కుడు నాగూర్‌వలి, షంషీర్, నాదేళ్ల విద్యాసాగర్, శివన్న, కృష్ణ, జేసీబీ వేణు, రెడ్డిబ్బూ, వేమయ్య, డ్యాన్స్‌రెడ్డెప్ప పాల్గొన్నారు. స్థానిక జడ్పీహైస్కూల్‌లోని అబ్దుల్ కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. బీజేపీ రాజంపేట పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకులకృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు రవికుమా ర్, ఎంఈవో రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, నాయకులు డాక్టర్ అబ్దుల్లా, నాగరాజు, భవానీ, సంతోష్, పిల్లస్వానాయక్, రెడ్డి పాల్గొన్నారు.



కలామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బి.కొత్తకోటలో: భారత మాజీరాష్ట్రపతి డాక్టర్ ఏపీజె అబ్దుల్‌కలాం 9వ వర్ధంతిని బి.కొత్తకోటలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నగరపంచాయతీ పరిధిలోని పలు పాఠశాలలతో పాటు మోడల్‌స్కూల్, సుంకుకళాశాల లలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యంఈవో రెడ్డిశేఖర్, సుంకు ప్రిన్సిపాల్ మంజునాథ్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ హనుమంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు జహీర్‌ఖాన్, నూర్‌మహమ్మద్, నరేంద్ర, నక్కామహేష్, ఉషశిరీషా, గాయిత్రి, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి



కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి

వాల్మీకిపురం, జూలై 27: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి పేర్కొన్నారు. శనివారం కళాశాలలో విద్యార్థులకు భారత రాజ్యాంగంపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారా ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందన్నారు. ఈకార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ నారాయణస్వామి, స్థానిక అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

తంబళ్లపల్లె, జూలై 27: సమాజంలో ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కన్నెమడుగు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మదన్‌మోహన్ అన్నారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమం ఎకో క్లబ్ పార్మేషన్‌లో బాగంగా శనివారం కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని కోరారు.

పంచముఖ ఆంజనేయస్వామికి విశేష పూజలు

కలకడ, జూలై 27:మండలంలోని బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి విశేష పూజలను చేశారు. ఈ సందర్భంగా వేకువ జామునే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అనంతరం నైవేద్యం సమర్పించి అభిషేకం, ఆకుపూజ కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జూలై 27:మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు

విద్యార్థులకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించాలి



డీవైఈవోకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 27: విద్యార్థుల సంఖ్యను అనుసరించి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక డీవైఈవో కార్యాలయంలో మదనపల్లె ఉప విద్యాశాఖ అధికారి పురుషోత్తంను యూటీఎఫ్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామిరెడ్డి లేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో 1050 మందికి ఒకే తెలుగు ఉపాధ్యాయరాలు, ఒకే హిందీ ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. వాల్మీకినగర్ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల్లో ఒకటి నుంచి ఏడు తరగతులకు 210 మంది విద్యార్థులు ఉండగా కేవలం నగులుగు ఉపాధ్యాయులే ఉన్నారు. దీని వలన విద్యార్థులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆరోపించారు. గత నవంబర్‌లలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంతో అప్పటికే సగం విద్యాసంవత్సరం పూర్తి కావడంతో విద్యార్థులకు న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు టి. సుధాకర్, నాయుడు, జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, మండల పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, గాలి రవీంద్ర, పయని మల్లేశ్వరబాబు, సీనియర్ నాయకులు రవిప్రకాష్, సుధాకర్, విజయ్‌కముఆర్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల పాపాలు ఎప్పటికైనా పండుతాయి



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, జూలై 27: ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబం, ఆయన అనుచరులు చేసిన పాపాలు ఎప్పటికైనా పండుతాయని మదనపల్లె తాజాగా వెలుగుచూస్తున్న సంఘటనలే సాక్ష్యమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎంపీ మిధున్‌రెడ్డి ఢిల్లీలో కూర్చొని స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని, వాస్తవానికి మదపపల్లె సబ్‌కలెక్టరేట్‌కు మూడు రోజులుగా భూ వివాదాలపై ఫిర్యాదులు చేసేందుకు వస్తున్న పెద్దిరెడ్డి బాధితులకు ఎంపీ ఏమి సమాధానం చెబుతారన్నారు. పెద్దిరెడ్డి సతీమణ పేరిట మదనపల్లెలో, విశ్వతమాల గ్రామంలో రిజిస్ట్రేషన్ అయిన విలువైన స్థలాల విషయాలను ఎందుకు చెప్పడం లేదన్నారు. వైసీపీ నాయకుల భూ అరాచకాలు బయటపడతాయనే సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లను దహనం చేయించారని వెంకటేశ్ ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విద్యాసాగర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు మాజీ జడ్పీటీసీ కువైట్ శంకర్ మృతి



మాజీ జడ్పీటీసీ కువైట్ శంకర్(ఫైల్)

ములకలచెరువు, జూలై 27: ములకలచెరువు మాజీ జడ్పీటీసీ, నియోజకవర్గ టీడీపీ నేత పూల శంకర్ అలియాస్ కువైట్ శంకర్(55) శనివారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బెంళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ కన్నుమూశారు. 2014లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ తరపున జడ్పీటీసీగా పోటీ చేసి గెలు పొందారు. అలాగే టీడీపీ బలోపేతం, పటిష్టతకు కష్టపడి పనిచేస్తూ పార్టీకి వీర విధేయుడిగా ఉన్నారు. ఆయన మృతితో టీడీపీకి తీరని లోటు ఏర్పడింది. ఆయన పార్థివదేహాన్ని నాయకులు, కార్యకర్తలు, ప్రజల సందర్శనార్థం ములకలచెరువుకు తీసుకొచ్చారు. అంత్యక్రియలు స్వగ్రామమైన వేపూరికోట పంచాయతీ బత్తలాపురంలో. ఆదివారం ఉదయం 11.30 గం టలకు జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ప్రచార సమన్వయ కర్త సీడ్ మల్లికార్జుననాయుడు, మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నేతలు గుత్తికొండ త్యాగరాజు, కేవీ రమణ, మంత్రి గిరిధర్ రెడ్డిలతో పాటు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మృతదేహం వద్ద నివాళులు అర్పించి కుటుంబ సభ్యుల ను ఓదార్చారు.

టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు వెంకట్రమణారెడ్డి మృతి



వెంకట్రమణారెడ్డి (ఫైల్ ఫొటో)

పెద్దతిప్పసముద్రం జూలై 27 :టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పీటీఎం మండలం టి.సదుం గ్రామం రామాపురంకు చెందిన బొంగు వెంకట్రమణారెడ్డి(56) అనారోగ్యంతో బాదపడుతూ శుక్రవారం రాత్రి బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం పలువురు టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు రామాపురం చేరుకుని ఆయన పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో వెంకట్రమణారెడ్డి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందించిన నాయకుడని కొనియాడారు. విషయం తెలిసిన వెంటనే ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ తంబళ్లపల్లె నాయకుడు జయచంద్రారెడ్డి, మాజీ శాసనసభ్యులు ఏవీ లక్ష్మీదేవమ్మ, కర్ణాటక రాష్ట్రం మాజీ హోం మంత్రి తనయుడు రాజశేఖర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా సురేంద్ర నాయుడు, సింగల్ విండో మాజీ చైర్మన్ సంపతికోట కిట్టన్న, మాజీ ఎంపీటీసీ బయ్యారెడ్డి, తాడిగోళ్లపల్లె సుధాకర్‌రెడ్డి, పీటీఎం మండల అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డితోపాటు మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు వెంకట్రమణారెడ్డి భౌతికకాయాన్ని సందిర్శించి నివాళులర్పించారు.

కలికిరి జాతర సందర్భంగా ప్రత్యేక బస్సులు

పీలేరు, జూలై 27: కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ జాతర సందర్భంగా ఆది, సోమవారాల్లో పీలేరు నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం బండ్ల కుమార్ శనివారం తెలిపారు. ఆ రెండు రోజుల్లో పీలేరు-కలికిరి మార్గంలో 12 సర్వీసులు, కలికిరి-సోమల మధ్య 5, కలికిరి-కలకడ మధ్య 5, కలికిరి-మదనపల్లె మధ్య 4, కలికిరి-సదుం మధ్య 2 సర్వీసులు నడపనున్నట్లు ఆయన ప్రకటించారు. అదే విధంగా ఆడికృత్తిక సందర్భంగా 29, 30 తేదీల్లో పీలేరు నుంచి పాకాలకు 5, దామలచెరువు నుంచి 2, కల్లూరు నుంచి 3 ప్రత్యేక సర్వీసులు నడుపుతామని ఆయన తెలిపారు.

రీజియన్‌లో మదనపల్లె వన్‌డిపో ఫస్ట్

మదనపల్లె అర్బన్, జూలై 27: రీజియన్‌లోనే మదనపల్లె వన్ డిపో ఓఆర్‌లో ప్రథమ స్థానం కైవసం చేసుకుందని డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఉద్యోగులతో శనివారం ఆయన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ మాసంలో కేఎంపీఎల్‌లో రెండవ స్థానం సాధించినందుకు ఆర్టీసీ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.